ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 01-09- 2026 | సంపుటి: 17, సంచిక: 150, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

కేసీఆర్ పెట్టిన తిండి తిని ప్రశాంత్ రెడ్డి

తండ్రీకూతుళ్లను విడదీశారు

- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ప్రశాంత్ రెడ్డి

తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందే...

ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నా

నిజామాబాద్ ఆగస్టు 31 (ప్రజాకలం) :

బీఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిప డ్డారు. జీవితంలో హరీశ్ రావు, సంతోశ్ కుమార్‌నైనా క్షమిస్తా.. కానీ ప్రశాంత్ రెడ్డిని మాత్రం క్షమించనని కవిత తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన రెండో రోజే కాంగ్రెస్ నాయకులను ఆయన కలిశారని ఆరోపించారు. కేసీఆర్ పెట్టిన తిండి తిని తండ్రీ, బిడ్డలను విడదీశారని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందేనని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీ యాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలో కైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు.

తరువాయి 2వ పేజీలో...

చదువుల బాటలో..

కొత్త వెలుగులు

విద్యా రంగంలో సంస్కరణలు ఎడ్యుకేషన్ పై ప్రజా ప్రభుత్వం నయా మార్క్

హైదరాబాద్, ఆగస్టు 31 (ప్రజాకలం) :

ఒక తరం భవిష్యత్తును మార్చే శక్తి విద్యకే ఉంది. అందుకే ప్రజా ప్రభుత్వం విద్యా రంగాన్ని కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలతో అనుసంధానించేలా సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ప్రక్షాళనకు నాంది పలికారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు మౌలిక వసతుల బలోపేతం, ఉపాధ్యాయుల నియామకాలు, సాంకేతికత ఆధారిత బోధన, నైపుణ్యాభివృద్ధి వంటి చర్యలతో విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు రూపకల్పన చేస్తూ ప్రభుత్వ బడులను మరింత ఆకర్షణీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్ వంటి వినూత్న కార్యక్రమాలతో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే.. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యను శక్తి శాఖ పరిధిలోకి తీసుకొచ్చి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే దిశగా అడుగులు వేస్తున్నారు. విద్యార్థి భవిష్యత్తే లక్ష్యంగా.. ప్రభుత్వ విద్యకు కొత్త రూపం ఇస్తున్నది ప్రజా ప్రభుత్వం.

భారీగా నియామకాలు

ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు డీఎస్సీ-2024 ద్వారా 11,062 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. పరీక్షలను రికార్డు సమయంలో పూర్తి చేసి, ఎంపికైన 10,006 మంది ఉపాధ్యాయులకు 2024 అక్టోబరులో నియామక పత్రాలు అందజేసింది. దీంతో ఎన్నో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల కొరతను తీర్చేందుకు టీజీపీఎస్సీ ద్వారా 1,392 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి, ఎంపికైన 1,239 మందికి పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ సారి ఉత్తమ టీచర్ అవార్డుల్లోనూ మహిళలకు 33 శాతం కోటాను అమలు చేసే దిశలో ప్రభుత్వం ఉంది.

మౌలిక వసతులపై దృష్టి.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు" ఏర్పాటు చేసి, వాటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.706 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టింది. పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ కమిటీలు కీలకంగా మారాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఆధునిక అకడమిక్ భవనాలు, హాస్టళ్లు, ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయనుంది.

తరువాయి 2వ పేజీలో...

జగిత్యాల జిల్లాలో పెరుగుతున్న

'పోక్సో' కేసులు..!

చిన్నారుల భద్రత పై తల్లిదండ్రులల్లో ఆందోళన

కఠిన చర్యలు తీసుకుంటున్నమంటున్న పోలీసులు

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్31 (ప్రజాకలం):

జగిత్యాల జిల్లాలో "పోక్సో" కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతిరోజు ఏదో ఒకచోట చిన్నారుల పై లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుతున్నాయన్న సంఘటనలు వెలుగులోకి వస్తుండటంతో చిన్నారుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మైనర్ బాలికలు, మహిళపై లైంగిక వేదింపులకు పాల్పడే దుండగుల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. జగిత్యాల జిల్లా, మల్యాల మండలంలో ఈమధ్య కాలంలో మైనర్ బాలిక పై అత్యాచారం జరిగిన ఘటన పై పోక్సో కేసు నమోదై, నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెల్సినదే. మరొక కేసులో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఓ మండలానికి చెందిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఓ నిందితుడికి పోక్సో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు,

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్

రైల్వే హబ్‌గా గద్వాల అభివృద్ధి

- రూ.66 కోట్లతో మరో ఆర్ఓబీ..
- రూ.42.82 కోట్లతో స్టేషన్ ఆధునికీకరణ
- కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల ఆగస్టు 31ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లాను రైల్వే హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు

పకడ్బందీగా ఏర్పాట్లు

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి

సమ్మిట్ విజయవంతానికి సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

సమావేశానికి హాజరైన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 31 (ప్రజాకలం) :

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు.

తరువాయి 2వ పేజీలో...

ప్రజాసేవే పరమావధిగా

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా

స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 31(ప్రజా కలం న్యూస్)

సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

చదువుల బాటలో.. కొత్త వెలుగులు

మొదటి పేజీ తరువాయి...

సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలని నో బ్యాగ్ డేను తీసుకోస్తుంది.

యంగ్ ఇండియా స్కూళ్లు..

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా పాఠశాలలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తొలి విడతలో 76 పాఠశాలలకు రూ.10,693.55 కోట్ల విలువైన టెండర్లను ఖరారు చేసింది. ఇప్పటికే 83 పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పాటు యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీర్‌ఖాన్‌పేట్‌లో 57 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా భావిస్తున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' 17 జూన్ న రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో అట్టహాసంగా ప్రారంభించారు. ఇప్పటికే మంచాలలో, కల్వకుర్తి నియోజకవర్గంలోని వంగూరు, పోల్కంపల్లికి మంజూరు చేశారు. మార్చిలో గజ్వేల్ నియోజకవర్గంలో టీపీఎస్ ఏర్పాటుకు రూ.16.62 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఒక్కో స్కూల్ కోసం రూ. 10 కోట్లు ఇవ్వాలని ఇటీవలే ప్రతిపాదనలు పంపించింది.

సాటిలేని ఏటీసీలు

తెలంగాణ రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఆధునిక అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ కింద మొత్తం రూ. 3,186 కోట్లు ఖర్చు చేసి ల్యాబ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోర్సులను ఆధునికీకరించనున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో 65 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చారు. ఇటీవల నిర్వహించిన ప్లేస్ మెంట్లలో ఏటీసీల్లో చదువుతున్న ఉట్నూరులో 99 మంది , వరంగల్ లో 122 , నిజామాబాద్ 44 మంది విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభించాయి.

ప్రతిష్టాత్మకం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ..

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకానికి జూన్ 15, 2026న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి విడతలో 1269 పాఠశాలలు, 33 కళాశాలల్లో 1,44,610 మంది విద్యార్థులు అందింది. రాష్ట్ర వ్యాప్తంగా 39 చోట్ల రూ. 299.90 కోట్లతో కేంద్రీకృత కిచెన్ల నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బ్రేక్ ఫాస్ట్ పథకంతో 22 లక్షల మంది లబ్ది పొందనున్నారు. వీటి కోసం రూ.720 కోట్లు ఖర్చువతుంది. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా రూ.56 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని సర్కారు పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతిగృహాల విద్యార్థులకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లు అందించే కార్యక్రమానికి జూన్ 19, 2026 న శ్రీకారం చుట్టనుంది. గురుకుల విద్యార్థులకు 22, పాఠశాల విద్యా ర్థులకు 7, వసతిగృహ విద్యార్థులకు 10 వస్తువులతో కూడిన కిట్లను సరఫరా జరుగుతుంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు 2026-27 విద్యాసంవత్సరానికి చదువుతున్న సమయంలోనే స్కాలర్ షిప్ లు రూ. 250 కోట్లు విడుదల చేసి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకొంటుంది.

వాట్సప్‌లో విద్యాసేవలు

విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సప్ ద్వారా ఇకపై నేరుగా ఫోన్లకు చేరనుంది. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను వాట్సప్ ద్వారా అందుతుంది. నకిలీలకు తావులేకుండా 25 రకాల సెక్యూరిటీ ఫీచర్లతో ఇంటర్ విద్యార్థులకు 'హై సెక్యూరిటీ' మెమోలు ప్రభుత్వం అందించింది. తొలిసారిగా మెమోపై రెండు కలర్ ఫొటోలు, క్యూఆర్ కోడ్‌ను సైతం ముద్రించారు.

బాలికలకు శానిటరీప్యాడ్స్

ఉన్నత విద్యలో అనుభవాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ డిగ్రీ చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచి సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్ స్టడీస్, గ్రామీణాభివృద్ధి, కృత్రిమ మేధ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పలు కొత్త కోర్సులను డిగ్రీ స్థాయిలో ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాలుగు లక్షల మంది విద్యార్థినులకు ఉచిత శానిటరీ ప్యాడ్ల పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

ఏఐ పాఠాలు..

పిల్లల్లో ప్రాథమిక విద్యా పునాదులను బలోపేతం చేయడానికి ఈ విద్యా సంవత్సరంలో మరో 2,769 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తోంది. ఇప్పటికే అమల్లో ఉన్న పాఠశాలలతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4,131 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ హైస్కూళ్లలో చదివే విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ నైపుణ్యాలు అందించేందుకు "అన్న..అక్క మెంటార్షిప్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 8,522 పాఠశాలలకు విస్తరించారు. దాదాపు 40 వేల మంది డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు మెంటార్లుగా సేవలందించనున్నారు. గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఏఐ కోర్సులు ప్రవేశపెట్టింది. విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు అమెజాన్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం ద్వారా 10 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ ఆధారిత శిక్షణ అందించనుంది.

ముమ్మరంగా ఎడ్యుకేషన్ హబ్ పనులు..

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.248 ఎకరాల్లో వివిధ విభాగాల నిర్మాణాలు సాగుతున్నాయి. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం.. పశు వైద్య విభాగానికి సంబంధించి రూ.200 కోట్లతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల నిర్మిస్తున్నారు. ఇటీవలే కొరియా స్పోర్ట్ వర్సిటీతో'యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ' ఒప్పందం చేసుకుంది.

కేసీఆర్ పెట్టిన తిండి తిని ప్రశాంత్ రెడ్డి

తండ్రీకూతుళ్లను విడదీశారు

మొదటి పేజీ తరువాయి...

'ఎన్ని కేసులు పెట్టినా నేను తప్పు చేయలేదనే చెప్పా. నన్ను తీహార్ జైలులో ఎందుకు పెట్టారు?' అని కవిత ప్రశ్నించారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కనికరం చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధతో కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. తనను పిరికిదాన్ని అనుకోవద్దని హెచ్చరించారు. జైలులో ఉన్న సమయంలో తన అత్తగారు అండగా నిలిచారని కవిత గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం నిద్రపోతోందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే ఉచిత విద్య, వైద్యం అమలు చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

తమ కార్యకర్తలను బెదిరించే రోజులు పోయాయని కవిత చెప్పుకొచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు గుప్పించారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమవుతున్నాయని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

రైల్వే హబ్‌గా గద్వాల అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

సోమవారం ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.42.82 కోట్లతో స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ, పార్కింగ్, నూతన పరిపాలన భవనం, ముఖద్వారం, అదనపు టికెట్ కౌంటర్ వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గద్వాలలో రూ.66 కోట్లతో మరో ఆర్‌ఓబీ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. స్టేషన్ పనులు పూర్తయిన అనంతరం అదనపు రైళ్లకు స్టాపింగ్ కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గద్వాల రైల్వే స్టేషన్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నందున శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల మీదుగా వెళ్లే అన్ని ముఖ్యమైన రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. గద్వాల-డోర్నకల్, మాచర్ల-గద్వాల రైల్వే లైన్ పనులను త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాలో పెరుగుతున్న

'పోక్సో' కేసులు..!

మొదటి పేజీ తరువాయి...

రూ.6,500 జరిమానాను కూడా విధించింది. బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని కూడా కోర్టు ఆదేశించింది.

ఇటీవల జిల్లాలో ఓ యువతి పై సామూహిక అత్యాచారానికి సంబంధించిన కేసు నమోదు కాగా, నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

జిల్లాలో ఓ చోట మైనర్ బాలిక పై వృద్ధుడైన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో బాలిక గర్భం దాల్చినట్లు వెలుగులోకి రావడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

బాలికపై జరిగిన అఘాయిత్యానికి సంబంధించి పోలీసులు వృద్ధుడి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిన్నారులపై నేరాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు: తల్లిదండ్రులు పిల్లల కదలికల పై అప్రమత్తంగా ఉండడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తనను గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు. మహిళలు, చిన్నారుల పై వేధింపులు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా జిల్లాలో వరుసగా చిన్నారుల పై వెలుగుచూస్తున్న ఘటనల నేపథ్యంలో చిన్నారుల రక్షణ, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

బాలికల భద్రత, రక్షణ, వారి పట్ల నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోక్సో చట్టంపై ప్రజలకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నారు. బాలికలపై లైంగిక వేధింపుల అనుమానం ఉన్న సందర్భాల్లో ఆలస్యం చేయకుండా పోలీసులకు లేదా సంబంధిత బాలల సంరక్షణ వ్యవస్థకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు

పకడ్బందీగా ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి...

సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఈ వార్‌రూమ్ ద్వారా మరింత బలోపేతం చేయాలని అన్నారు.

సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్ కమిటీ, మీడియా-కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్ కమిటీ, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి , వారితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వివరించేలా కార్యక్రమ రూపకల్పన ఉండాలని సూచించారు.

ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం

సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేసి సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి అవకాశాలను ప్రచారంలో ప్రధానంగా ప్రదర్శించాలని తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొందించి తనకు అందజేయాలని ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటి సిఎండి శశాంక, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ తదితరులు ఉన్నారు.

ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్య, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పన కు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజక వర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖలు మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అంగీకరిస్తే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి అన్నారు.ఖమ్మం పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 250 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడాలన్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, అయితే ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని, వాటిని సక్రమంగా నిర్వహించి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఖమ్మం ప్రజలపైనే ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్.. దేశానికి

గ్లోబల్ నాలెడ్జ్ హబ్!

హైదరాబాద్, ఆగస్టు 31 (ప్రజాకలం) :

హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి వర్సిటీలు

సాఫ్ట్ వేర్ , ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్... భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం.యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది.

ఎల్ఎస్ఈ, ఎస్ఓఏఎస్‌లతో చర్చలు...ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి.

హైదరాబాద్‌లో హార్వర్డ్ కోర్సులు...ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్... బ్రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన విఫలం

రుద్రంగి మండల బీఎస్పీ నాయకులు

రుద్రంగి, ఆగష్టు 31, (ప్రజాకలం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని రుద్రంగి మండల బీఎస్పీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భముగా వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, పెన్షన్లు రూ. 2 వేల నుండి రూ. 4 వేలు పెంచుతామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని, రూ. 500 కె గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులను, ఇలా అన్ని వర్గాల ప్రజలను ప్రజా ప్రభుత్వం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు అలాగే బీడీ కార్మికులకు సైతం పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే యూరియా కొరత వలన రైతులు ఇబ్బందులకు గురవుతుంటే కొత్తగా యూరియా ఆప్ వలన మరింత ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. వెంటనే యూరియా ఆప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1000 రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైనందున సంబరాలు జరుపుకునే అర్హత వారికి లేదని, ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్, ఉపాధ్యక్షుడు, ఏనుగందుల సతీష్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్ల నవదీప్, ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్ నాయకులు మల్యాల మహేష్, కట్కూరి హనుక్, దయ్యాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

- అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదు

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించడం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటం వంటివి చేయరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఎస్పి అశోక్ కుమార్ వెల్లడించారు.

రాజారాంపల్లి యొక్క సరిహద్దులు నిర్ణయించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

ఎండపల్లి, ఆగస్టు 31 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం లో సోమవారం రోజున రాజారాంపల్లి సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాజారాంపల్లి గ్రామ పంచాయతీ గత 30 సంవత్సరాల క్రితం ఏర్పడిందని కానీ ఇంత వరకు రాజారాంపల్లి గ్రామం యొక్క సరిహద్దులు సర్వే నంబర్లు నిర్ణయించలేదని ఇప్పుడు గ్రామం యొక్క సరిహద్దులు సర్వే నంబర్ల తో సహ హద్దులు నిర్ణ యించాలని ఎండపల్లి మండల కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం లో రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్, పాలకవర్గం ఆధ్వర్యం లో మండల ఎంపీడీవో దొండ కృపాకర్ కు ఫిర్యాదు చేశారు.

ఫిజికల్ సైన్స్ బోధనలో వెంకటరమణ సేవలు మరువలేనివి

మల్లాపూర్ , ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) మండలం లోని సిరిపూర్ జడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన శ్రీపాద వెంకటరమణ పదవీవిరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని సర్పంచ్ పెంట సౌజన్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా వెంకటరమణను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు జలంధర్, గణేష్, ప్రణీత, రాజమణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి

పారదర్శకంగా విధులు నిర్వహించాలి : మెట్ పల్లి డీఎస్పీ రాములు

మెట్ పల్లి (కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజాకలం):విధుల్లో పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని మెట్ పల్లి డీఎస్పీ రాములు వెల్లడించారు. కోరుట్ల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రాములు సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లోని కేసులకు సంబంధించిన ఫైల్స్, వివిధ రకాల రిజిస్టర్లు, రికార్డులు, ఇతర ముఖ్యమైన దస్తావేజులను డీఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణపై సమీక్షించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ స్టేషన్‌లో పరిశుభ్రత, రికార్డుల సక్రమ నిర్వహణతో పాటు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణ, అప్రమత్తతతో విధులు నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, చట్టపరంగా వేగవంతమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని

తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎస్పీ రాములు సూచించారు. ముఖ్యంగా ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించాలని డీఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని, చట్టపరంగా తగిన విధంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ వార్షిక తనిఖీలో కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజ్, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్లు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దశలవారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి

- మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

- దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- వినాయక మండపాల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజాకలం): ఎలాంటి వివక్ష లేకుండా దశలవారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 13 అంశాలను చర్చించగా, కౌన్సిల్ సభ్యులు వాటికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని పలు మట్టి రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, వాటిని వెంటనే పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాబోయే వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాల వద్ద నీరు నిల్వకుండా అవసరమైన చోట మట్టి పోయించాలని, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వార్డుల్లోనూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని, మున్సిపాలిటీకి మరిన్ని నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి, జేఏఓ రమేశ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత పర్యవేక్షణకె సిసి కెమెరాల ఏర్పాటు

సి. ఐ రాంనరసింహారెడ్డి

గొల్లపల్లి ఆగస్టు 31 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం చెందోలి గ్రామంలో 6 నూతన సీసీ కెమెరాలను ధర్మపురి సిఐ నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ మాట్లాడుతూ, గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను ముందుగానే నిరోధించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే నిందితులను గుర్తించి నేరాలను ఛేదించడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాలలో ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన రహదారులు, గ్రామ ప్రవేశ , నిష్క్రమణ మార్గాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామ భద్రతను మరింత పటిష్టం చేసుకోవచ్చని తెలిపారు. గొల్లపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని

సూచించారు. "సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు మాత్రమే కాకుండా, గ్రామ ప్రజల భద్రతకు నిరంతరం పర్యవేక్షణ వ్యవస్థగా పనిచేస్తాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఎస్ఐ ఎం. కృష్ణసాగర్ రెడ్డి, చెందోలి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

1000 రోజుల ప్రజా పాలనలో బెల్లంపల్లి నియోజవర్గం

అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంది

- ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి టౌన్, ఆగస్టు 31 (ప్రజాకలం ప్రతినిధి) మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో వెయ్యి రోజు ప్రజాపాలనలో బెల్లంపల్లి నియోజవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడారు. ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,ప్రజా ప్రతినిధులకు,కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని,ప్రజా పాలన వెయ్యిరోజు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం,అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి లక్షలాది రైతులకు రుణ విముక్తి కల్పించిందన్నారు. రైతు భరోసా,ధాన్యం కొనుగోలు,సన్న వడ్లకు బోనస్ అందించడం ద్వారా రైతాంగానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు.కాంగ్రెస్ పాలనలోనే బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు. రానున్న రెండు సంవత్సరాలలో బెల్లంపల్లి నియోజవర్గం రూపురేఖలు మార్చేసి అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తానని ధీమా వ్యక్తం చేశారు..

కాంగ్రెస్ పార్టీ మినీ క్యాంపు కార్యాలయం పనుల పర్యవేక్షణ

ఎండపల్లి, ఆగస్టు 31 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రాజా రాంపల్లి కాంగ్రెస్ పార్టీ మిని క్యాంపు కార్యాలయం పనులను ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల తో కలిసి పర్యవేక్షించారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మినీ కార్యా లయం పూర్తి అయితే ఎండపల్లి, వెల్గటూర్, ధర్మారం, గొల్లపల్లి, పెగడపల్లి మండలాల కు అందు బాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, ఎండపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్, కొత్తపేట గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, మారేడుపల్లి గ్రామ సర్పంచ్ బాల్సాని శారద-మల్లేష్ గౌడ్ లు కలిసి రాజారాంపల్లి లో కాంగ్రెస్ పార్టీ మినీ క్యాంపు కార్యాలయ పనులను మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్ ఆధ్వర్యం లో పనులను పర్యవేక్షించారు.

సర్వేయర్ల లైసెన్సుల రద్దు అన్యాయం

- ఉపాధి కోల్పోయిన సర్వేయర్లకు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి,ఆగస్టు 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో 31 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా ఒక్క పెద్దపల్లి జిల్లాలోనే ఇంత భారీ సంఖ్యలో లైసెన్సులు రద్దు చేయడం ముమ్మాటికీ అన్యాయమని ఆమె ఆరోపించారు.అకస్మాత్తుగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన సర్వేయర్లకు ఈ సందర్భంగా ఆమె పూర్తి సంఘీభావం ప్రకటించారు.ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయంపై సర్వేయర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు.తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచించి,సర్వేయర్ల ఉపాధిని కాపాడేలా తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద్,రాష్ట్ర సలహాదారు గోవర్ధన్,జిల్లా నాయకులు తిరుపతి,సురేష్,గోపి,అభిలాష్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద వికలాంగుడికి పెన్షన్ మంజూరు చేయాలి

- ఆర్డీఓను కోరిన 21వ వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమ్

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 31(ప్రజాకలం): 21వ వార్డుకు చెందిన నిరుపేద వికలాంగుడికి ప్రభుత్వం నుంచి వికలాంగ పెన్షన్ అందేలా ప్రత్యేకంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని 21వ వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమ్ ఆర్డీఓను కోరారు. సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరంగా ఉన్న వికలాంగుడి కుటుంబ పరిస్థితిని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వికలాంగుడి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సదరం సర్టిఫికెట్ లేకపోవడం కారణంగా పెన్షన్ పొందలేకపోవడం బాధాకరమని కౌన్సిలర్ అజీమ్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అర్హతలను మానవతా దృక్పథంతో పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఖాజా అజీమ్‌తో పాటు సీనియర్ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కష్టాల్లో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వం తు కృషి చేస్తానని కౌన్సిలర్ ఖాజా అజీమ్ తెలిపారు.

మెట్‌పల్లిలో ఘనంగా వనమహోత్సవం

మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు31 (ప్రజా కలం): పర్యావరణ పరిరక్షణ, పట్టణాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో మెట్‌పల్లి పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని నేషనల్ హైవే డివైడర్లలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, డివైడర్లలో విస్తృతంగా మొక్కలు నాటడంతో మెట్‌పల్లి మరింత పచ్చగా, ఆహ్లాదకరంగా మారేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను నిరంతరం సంరక్షించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, నాయకులు కిషోర్, లింగేశ్వర్, డీఈ నాగేశ్వర్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
మంగళవారం, సెప్టెంబర్ 1, 2026

కల్తీ ఆహారంతో ప్రజల ఆరోగ్యాలు బలి

హైదరాబాద్ నగరం రుచుల నగరంగా ఎంత ప్రసిద్ధి చెందిందో, ఇప్పుడు ఆహార భద్రతపై అంతే అప్రమత్తత అవసరమవుతోంది. నగరంలోని కొన్ని ప్రముఖ, ప్రజాదరణ పొందిన హోటళ్లు, రెస్టారెంట్లలో ఇటీవల నిర్వహించిన ఆహార భద్రత తనిఖీల్లో వెలుగుచూసిన పరిస్థితులు వినియోగదారులను తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. గడువు తీరిన ఆహార పదార్థాలు, పురుగు పట్టిన లేదా కుళ్లిన కూరగాయలు, వంటగదుల్లో కీటకాల సంచారం, అపరిశుభ్రమైన తయారీ, నిల్వలో లోపాలు, లేబలింగ్ నిబంధనల ఉల్లంఘనలు బయటపడటం సాధారణ నిర్లక్ష్యంగా కొట్టిపారేయలేని విషయం. ఆగస్టు 29న తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ అధికారులు, పోలీసులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆరు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చేపట్టిన ఈ తనిఖీల్లో 11 ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపారు. కొన్ని ఉత్పత్తుల విషయంలో తప్పుడు లేబలింగ్, బ్రాండ్ వివరాలకు సంబంధించిన ఉల్లంఘనలూ గుర్తించి, సంబంధిత అధికారిక చర్యలు ప్రారంభించారు. నాలుగు మెరుగుదల నోటీసులు, మూడు వివరణ కోరే నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఇక్కడ అసలు ఆందోళన ఎన్ని నోటీసులు ఇచ్చారన్నది కాదు; వినియోగదారుడి ప్లేటులోకి ఏమి చేరుతోంది అన్నదే. ఆహారం తయారు చేసే ప్రదేశంలో పరిశుభ్రత లోపిస్తే దాని ప్రభావం నేరుగా ప్రజల ఆరోగ్యంపై పడుతుంది. కలుషిత ఆహారం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, ఆహార విషబాధ వంటి సమస్యలు తలెత్తవచ్చు. బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులతో కలుషితమైన ఆహారం మరింత తీవ్రమైన అనారోగ్యానికి దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారికి ప్రమాదం ఎక్కువ. కీటకాలు సంచరించే వంటగదులు కేవలం అసహ్యకరమైన దృశ్యం మాత్రమే కాదు. అవి సూక్ష్మజీవులు, మలినాలను ఆహారంలోకి తీసుకెళ్లే వాహకాలుగా మారవచ్చు. ముడి పదార్థాలు, వండిన ఆహారం, వ్యర్థాలను సక్రమంగా వేరు చేయకపోవడం, సరైన ఉష్ణోగ్రతలో ఆహారాన్ని నిల్వ చేయకపోవడం వంటి లోపాలు కలుషితానికి దారితీస్తాయి. గడువు ముగిసిన పదార్థాలను వినియోగించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. హోటల్ ఎంత ప్రసిద్ధమైనదైనా, రద్దీ ఎంత ఎక్కువైనా, బ్రాండ్ విలువ ఎంత గొప్పదైనా ఆహార భద్రత విషయంలో మినహాయింపు ఉండకూడదు. వినియోగదారుడు తన కష్టార్జిత డబ్బుతో భోజనం కొనుగోలు చేస్తున్నాడు; దానికి ప్రతిగా అనారోగ్యాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాకూడదు. అయితే తనిఖీలు కేవలం ఆకస్మిక చర్యలుగా మిగిలిపోకూడదు. నిరంతర తనిఖీలు, పారదర్శక ప్రయోగశాల పరీక్షలు, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే వేగవంతమైన చర్యలు అవసరం. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించే సంస్థలను ప్రోత్సహించాలి. హోటల్ యాజమాన్యాలకూ బాధ్యత ఉంది. నాణ్యమైన ముడి పదార్థాల వినియోగం, వంటగది పరిశుభ్రత, సరైన నిల్వ, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, గడువు తేదీల నిరంతర తనిఖీ–ఇవన్నీ ఖర్చులుగా కాకుండా ప్రజల ఆరోగ్యంపై పెట్టుబడిగా చూడాలి. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి. ఆహారంలో అసాధారణ వాసన, రంగు, రుచి లేదా పరిశుభ్రత లోపం కనిపిస్తే మౌనంగా ఉండకూడదు. ఫిర్యాదు చేయడం ప్రతి వినియోగదారుడి హక్కు. ఆహారం రుచిగా ఉండటం మాత్రమే కాదు, సురక్షితంగా ఉండటం కూడా అంతే ముఖ్యం. ఒక ప్లేటు భోజనం వెనుక ఒక కుటుంబం ఆరోగ్యం ఉంది. అందుకే హైదరాబాద్ ఆహార సంస్కృతి ఎంత గొప్పదో, దాని ఆహార భద్రతా ప్రమాణాలు కూడా అంతే గొప్పగా ఉండాలి. రుచికి రాజీ పడకపోవడం ఎంత అవసరమో, ఆరోగ్యానికి రాజీ పడకపోవడం అంతకంటే అవసరం.

– హెచ్.ప్రతాప్

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం ఆగస్టు 31 (ప్రజాకలం ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఇబ్రహీంపట్నం కార్యాలయం లో నిర్వహించబడింది. ప్రజల నుండి 4 వరకు వినతులులను స్వికరించారు. వినతులు రెవెన్యూ డిపార్ట్మెంట్ కి 2, ఆర్టీసీ-1, పంచాయతీ రాజ్1 చొప్పున వచ్చాయి.వాటిని సంబంధిత శాఖలకు పంపడం జరిగింది. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సిహెచ్. గణేష్ అదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దర్ వరప్రసాద్, ఎంపీఓ రామకృష్ణ రాజు,ఎస్సై జి. నవీన్ కుమార్,ఎంఈఓ బండారి మధు, వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మండల స్థాయిలో గల 23 శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం

అదనపు ఎస్పీ చేతన్ నితిన్ – ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా: పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేయడం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ఉద్యోగ జీవితమంతా అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమే కాదని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని అదనపు ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన జమీల్ అహ్మద్ (ఎస్ఐ), సీహెచ్. శ్రీనివాస్ (ఏఎస్ఐ), ఆర్. కృష్ణ కుమార్ (ఏఎస్ఐ), ఏ. శ్రీనివాస్ (హెడ్ కానిస్టేబుల్), పీ. రాజయ్య (హెడ్ కానిస్టేబుల్) లను అదనపు ఎస్పీ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారి సేవలను అభినందిస్తూ కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ కాలంలో కుటుంబ సభ్యులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని అన్నారు. సేవా కాలంలో సహకరించిన జిల్లా

పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో సేవలందించే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులోనూ సమాజానికి తమవంతు సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి, పోలీస్ బ్యాండ్‌తో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, పోలీసు సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎండపల్లి ఎంపీపీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

- ప్రజల నుండి పలు సమస్యలకు సంబంధించిన 12 ఫిర్యాదుల స్వీకరణ

ఎండపల్లి, ఆగస్టు 31 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ ఎంపీపీ కార్యాలయం లో సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించ బడింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన 12 దరఖాస్తులు స్వీకరించ బడ్డాయి. అధికారులు అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. ప్రజా వాణి లో ఫిర్యాదు చేసిన మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎంపీడీవో కృపాకర్ కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. చెన్న కుమారస్వామి మాట్లా డుతూ రైతుల్లో చాలా మంది నిరక్షరాస్యులు ఉన్నారని వారికి యాప్ పై సరైన అవగాహన లేక సాంకేతిక కారణాలతో సమయానికి రైతులకు యూరియా అందడం లేదని యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేసి పాత పద్ధతిని పునరుద్ధ రించాలని ఫిర్యాదు పత్రం లో కోరారు. ఎంపీడీవో దొండ కృపాకర్ పలు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదుల ను తక్షణమే పరిష్కరించాలని పలు శాఖల అధికారుల ను ఆదేశించారు. హాజరైన వివిధ శాఖల 13 మంది అధికారులు హాజర య్యారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్, తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, పోలీస్ శాఖ రత్నసాగర్, మండల వ్యవసాయ శాఖ అధికారి కామల్ల మహేష్, పశు వైద్యాధికారి బూర మనోజ్ కుమార్, మండల విద్యాధికారి అసిస్టెంట్ కిషోర్ కుమార్, వైద్య అధికారి ఎంపీహెచ్ఎస్ రమ్యవల్లి, శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి, అంగన్ వాడీ ప్రాజెక్ట్ అధికారి యం ఆండాలు, ఎస్సీ సంక్షేమ శాఖ ఎస్సీడీవో చుంచు మధుకర్, మండల హౌసింగ్ అధికారి ఏఈ ఎస్ గౌతమి, ఇరిగేషన్ సహాయ ఇంజనీర్ వి సప్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ / రెంజ్ ఆఫీసర్ ఇస్లావత్ నరేష్, విద్యుత్ సహాయ ఇంజనీర్ లైన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రభాకర్, పాల్గొన్నారు. పలు శాఖల కు వచ్చిన ఫిర్యాదులు మండల ప్రజా పరిషత్ -3 ఫిర్యాదులు, తహశీల్దార్ – 06 ఫిర్యాదులు, మండల వ్యవసాయ శాఖ అధికారి -2 ఫిర్యాదులు, విద్యుత్ శాఖ01 ఫిర్యాదు ప్రజాసమస్యలను వెంటనేపరిష్కరిం చేందు కు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

విద్యతోనే అసలైన సామాజిక స్వాతంత్ర్యం

స్వేరోస్ వ్యవస్థాపకులు,డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి – దాసరి ఉష

పెద్దపల్లి,ఆగస్టు31: (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సమాజంలో అసమానతలు తొలగిపోయి నిజమైన సామాజిక స్వాతంత్ర్యం సిద్ధించాలంటే నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన స్వేరోస్ జ్ఞాన సమ్మేళన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా,పెద్దపల్లి జిల్లా నాయకురాలు దాసరి ఉష ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.ముందుగా మధురానగర్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుండి ర్యాలీగా వచ్చి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సభను ద్దేశించి ప్రసంగించారు. సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక అంతరాలు తొలగిపోవాలంటే కేవలం నాణ్యమైన మరియు విలువలతో కూడిన విద్య ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు. బహుజన, పేద వర్గాల పిల్లలు సైతం గుణాత్మక విద్యను అభ్యసించి,వ్యవస్థలో కీలకమైన నిర్ణయాత్మక స్థానాలను అధిరోహించినప్పుడే నిజమైన సామాజిక స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేవలం అక్షరాస్యతతో సరిపెట్టుకోకుండా,చుట్టూ జరుగుతున్న పరిణామాలపై,హక్కుల గురించి నిలదీసి ప్రశ్నించే తత్త్వాన్ని విద్యార్థి లోకం అలవర్చుకోవాలని సూచించారు.ప్రస్తుత సామాజిక పరిస్థితులు,విద్యా రంగంలో మారుతున్న విధానాలు,యువత ఎదుర్కొంటున్న ఉపాధి సవాళ్లపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించారు.యువత ఎప్పుడూ సంప్రదాయ పద్ధతులకు వెళ్లకుండా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, నిర్దిష్టమైన లక్ష్యాల సాధన వైపు పయనించాలని దిశానిర్దేశం చేశారు.కులం, మతం,ప్రాంతం,లింగ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వేరో భావజాలంతో ముందు సాగాలని సూచించారు.ఎవరి కాళ్లపై వారు నిలబడేలా చేయడమే స్వేరోస్ సంకల్ప మన్నారు. అనంతరం నాయకురాలు దాసరి ఉష ప్రసంగిస్తూ..నేటి యువత కేవలం సాధారణ చదువులు, ఉద్యోగాల సాధనకే పరిమితం కాకుండా,విస్తృతమైన సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలను రూపుమాపడానికి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,హక్కుల పరిరక్షణకు యువత బలమైన గళం వినిపించాలని ఆమె కోరారు.చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ స్ఫూర్తిదాయక సదస్సు గంగాధర ప్రాంత యువతలో నూతనోత్సాహాన్ని నింపిందని పలువురు వక్తలు కొనియాడారు.

భవిష్యత్తులోనూ ఇలాంటి విద్యా,ఉద్యమ చైతన్య కార్యక్ర మాలను మరెన్నో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, విద్యార్థి సంఘాల ప్రముఖులు,యువతీ యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను కలిసిన నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషా

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజాకలం) : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్‌ను మెట్‌పల్లి నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషా మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌కు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు.

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

– ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ – మెట్‌పల్లి 8వ వార్డులో రూ.2 లక్షల డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు (ప్రజా కలం):

పట్టణంలోని 8వ వార్డులో రూ.2 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య మెరుగుదలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 8వ వార్డులో స్థానికులు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల సమస్యకు నూతన డ్రైనేజీ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ ధీవకొండ మానస విష్ణు, పురుషోత్తం, అజయ్, నరేశ్, ఆనంద్, నాయకులు పుదారి సుధాకర్, పెద్ద సలీం, కిషోర్, వేణుగోపాల్, లింగేశ్వర్, మొరపు తేజ, జావిద్, రవి తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా భారత్ జోడో హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధిగా నాగబెల్లి మహేష్

హనుమకొండ, ఆగస్టు 31:–(ప్రజా కలం ప్రతినిధి) : ఆల్ ఇండియా భారత్ జోడో సంస్థ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధిగా ఐనవోలు మండలం రాంనగర్ గ్రామానికి చెందిన నాగబెల్లి మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జనరల్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సామి ఈ నెల 27న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.సంస్థ రాష్ట్ర కమ్యూనికేషన్ విభాగంతో సమన్వయం చేసుకుంటూ ఆల్ ఇండియా భారత్ జోడో సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా అధికార ప్రతినిధి కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే బాధ్యతలను తక్షణమే స్వీకరించి, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. నాగబెల్లి మహేష్ నియామకంపై హనుమకొండ జిల్లాకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

గొల్లపల్లి ఆగస్టు 31 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన స్పందన లభించింది. గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని ధర్మపురి సిఐ రామ్ నరసింహారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్, ఆధ్వర్యంలో చైర్మన్, ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి, సర్పంచ్ నల్ల నీరజలతో కలసి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మపురి సిఐ రామ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. కంటి చూపు సమస్యలతో బాధపడే నిరుపేదలకు ఉచితంగా పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమ పోలీసు శాఖ తరపున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లోని ప్రతీ పేదవాడికి కంటి వెలుగును అందించాలనే సంకల్పంతోనే రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ మహత్కార్యాన్ని చేపట్టినట్లు తెలిపారు. శిబిరంలో ఎంపికైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆపరేషన్లు, మందులు, రవాణా మరియు భోజన వసతులను తమ లయన్స్ క్లబ్ ద్వారా సమకూరుస్తున్నామని ఆయన వివరించారు. ఈ శిబిరంలో చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన 78 మంది బాధితులకు రేకుర్తి కంటి ఆసుపత్రి నిపుణులు అధునాతన పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో తీవ్ర కంటి సమస్యలతో బాధపడుతూ, శస్త్రచికిత్స అవసరమున్న 38 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన రోగులను లయన్స్ క్లబ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. వీరికి అక్కడ ఉచితంగా కంటి ఆపరేషన్లు, మందులు, కళ్ళజోళ్ళు, భోజన, రవాణా వసతులను లయన్స్ క్లబ్ వారు పూర్తి ఉచితంగా సమకూరుస్తున్నారు.

అన్నదాన కార్యక్రమం.. శిబిరానికి విచ్చేసిన రోగులకు, వారి అటెండర్లకు ప్రోగ్రామింగ్ చైర్మన్, ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలకు చూపునిచ్చే ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ సాగర్, సర్పంచ్ నల్ల నీరజ, సతీష్ రెడ్డి, నిర్వహణ చైర్మన్ గురిజాల బుచ్చిరెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, పాస్ట్ కార్యదర్శి నరహరి, కోశాధికారి సట్ట సురేష్, లయన్ సభ్యులు మునిగాలా మల్లేశం, శనిగరపు మల్లేశం, లీడ్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ తాడూరి శ్రీనివాస ఆచార్య, కచ్చు కొమురయ్య, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ – ప్రజావాణికి 87 వినతుల స్వీకరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 31:

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు జాగ్రత్తగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, ఎక్సైజ్, పౌరసరఫరాలు, భూ సర్వే–రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లు–రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్య–ఆరోగ్యం, మైనింగ్, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 87 వినతులను అధికారులు స్వీకరించారు.

అధికారులతో సమీక్ష సమావేశం

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన లక్ష్యాలను సమీక్షించుకుని, సాధించిన పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటి, వాటికి జియోట్యాగింగ్ చేయాలని, నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు శాఖల వారీగా నాటిన మొక్కల పురోగతి వివరాలను ఈ రోజు సాయంత్రంలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవం, భూభారతి, ప్రజావాణి తదితర కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లా అధికారికి కేటాయించిన మండలాలను స్పెషల్ ఆఫీసర్లుగా పర్యవేక్షించాలని, ఆయా మండలాల్లో క్రమం తప్పకుండా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు. ఎం.పి.డి.ఓ లు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎ.పి.ఎం లు, ఎ.పి.ఓ లు తదితర

మండలస్థాయి అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, సమస్యలను గుర్తించి సాధ్యమైన మేరకు స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాల సాధనపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వారానికొకసారి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలిన లక్ష్యం, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించాలని అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పనులకు సంబంధించి మండలాల వారీగా గ్రౌండింగ్ కానీ ఇళ్లను గుర్తించి, వాటి నిర్మాణం ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు అందేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను కూడా వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగిం చుకుని, అవసరమైన పనులను గుర్తించి ప్రారంభించాలని సూచించారు. ప్రజావాణి, ఆర్టీఐ దరఖాస్తులు, కోర్టు కేసులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సంబంధించిన అంశాలు తదితర పెండింగ్ వ్యవహారాలను అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలని అన్నారు. ప్రతి శాఖలో పెండింగ్ అంశాలను గుర్తించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని, అవసరమైన చోట అంతర్‌శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పర్యటించి, ప్రభుత్వ కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. నిర్మల, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

2002లో ఒక పేరు.. 2026లో మరో పేరు ప్రజావాణిలో ఫిర్యాదు

ఓటరు జాబితాలో పేర్లు, తండ్రి పేర్ల మార్పులపై సమగ్ర విచారణకు డిమాండ్

(నందిగామ, ఆగస్టు 31 ప్రజా కలం ప్రతినిధి)

ఓటరు జాబితాలో తమ కుటుంబ సభ్యుల పేర్లు, తండ్రి పేర్లు మారిపోయిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి న్యాయం చేయాలని కోరుతూ అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన పాలకొండ మచ్చేందర్ గౌడ్ సోమవారం నందిగామ మండల పరిధిలోని రైతు వేదిక లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2002 నాటి ఓటరు జాబితాలో నమోదైన వివరాలకు, 2026 నాటి ఓటరు జాబితాలో నమోదైన వివరాలకు స్పష్టమైన తేడా ఉందని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాలకొండ మచ్చేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, 2002 నాటి ఓటరు జాబితాలో గొల్ల జంగయ్య – తండ్రి లక్ష్మయ్య, గొల్ల రాములు – తండ్రి లక్ష్మయ్యగా వివరాలు నమోదై ఉన్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం 2026 నాటి ఓటరు జాబితాలో అదే వ్యక్తుల పేర్లు పాలకొండ జంగయ్య – తండ్రి నారాయణ, పాలకొండ రాములు – తండ్రి నారాయణగా నమోదైనట్లు పేర్కొన్నారు. ఒకే వ్యక్తుల పేర్లు, తండ్రి పేర్లు కాలక్రమంలో ఎలా మారాయి? ఈ మార్పులు ఎప్పుడు, ఎవరి అభ్యర్థన మేరకు జరిగాయి? మార్పులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులు, ఆధార పత్రాలు సమర్పించారు? సంబంధిత అధికారులు ఏ ఆధారాలతో ఈ వివరాలను నమోదు చేశారనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని మచ్చేందర్ గౌడ్ కోరారు. 2002 నాటి ఓటరు జాబితా నుంచి 2026 నాటి ఓటరు జాబితా వరకు జరిగిన మార్పులకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించాలని, ఓటరు వివరాల సవరణకు సమర్పించిన దరఖాస్తులు, ఆధార పత్రాలు, విచారణ నివేదికలు, సంబంధిత అధికారిక రికార్డులను వెలికితీసి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సంబంధిత భూములు, రెవెన్యూ రికార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు తదితర అధికారిక పత్రాల్లో పేర్లు, తండ్రి పేర్లలో మార్పులు జరిగి ఉంటే వాటికి సంబంధించిన ప్రక్రియను కూడా అధికారులు పరిశీలించాలని కోరారు. పేర్ల మార్పుల కారణంగా పాలకొండ కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని మచ్చేందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం కారణంగా కుటుంబానికి కొంతకాలంగా న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని, కుటుంబ సభ్యుల్లో ఒకరు దీర్ఘకాలంగా కోర్టు వ్యవహారాలతో ఇబ్బందులు పడి అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రికార్డుల్లో తప్పుడు సమాచారం లేదా నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసినట్లు విచారణలో తేలితే, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మచ్చేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, 2002–2026 మధ్య ఓటరు జాబితాల్లో జరిగిన పేర్ల మార్పుల వెనుక వాస్తవాలను వెలికితీసి, పాలకొండ కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు

ఏడు రోజుల కార్యాచరణ

– మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పిలుపు

నాగర్‌కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా కలం): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఏడు రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం నాడు నాగర్‌కర్నూల్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరుగ్యారంటీలు,420 హామీలను అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అవుతున్న చిన్న హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఎన్ని అమలు చేయలేదో ప్రజలకు వాస్తవాలను వివరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ హామీల అమలుపై చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల స్థాయి నాయకుడు తన పరిధిలోని గ్రామాలను నిరంతరం సందర్శించాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై గ్రామ, మండల స్థాయిలో పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ నోటిఫికేషన్లపై యువతతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రైతుల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకోవాలని మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు రైతు బంధు రుణమాఫీ సాగునీరు ఎరువులు విద్యుత్తు సమస్యలపై రైతులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు ప్రతి నాయకుడు ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజల మధ్య ఉండాలని ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్థాయిలో పార్టీ బల్లపడితేనే తిరిగి అధికారంలోకి రాగలమని కార్యకర్తలకు సూచించారు ఈ సమావేశంలో తిమ్మాజిపేట బిజినపల్లి నాగర్ కర్నూల్ తెలకపల్లి తాడూరు మండలాలకు చెందిన టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వతగిరి పోలీస్ స్టేషన్లో మహేంద్ర బట్ పై పిటీషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు.

(వరంగల్ / పర్వతగిరి) ఆగస్టు 31, ప్రజాకలం ప్రతినిధి:

రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఆదేశానుసారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శీనన్న పిలుపు మేరకు సోమవారం పర్వతగిరి పోలీస్ స్టేషన్లో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరుకుడు రవీందర్ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ పై పిటిషన్ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హల్ద్వానీలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించిన అనంతరం, బిజెపి–ఆర్ఎస్ఎస్ కు చెందిన కొందరు వ్యక్తులు ఆయన ప్రసంగించిన వేదికకు శుద్ధీకరణ చేశారు. ఈ శుద్ధీకరణ చర్య కేవలం అత్యంత ఖండనీయమైన, సిగ్గుచేటైన ఆలోచనకు ప్రతీక మాత్రమే కాదు, మన రాజ్యాంగాన్ని ఎస్సీ, ఎస్టి చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే కాకుండా, చట్టపరమైన నేరం కూడా, ఈ ఘటన జరిగి 20 రోజులు గడిచినా, ప్రధానమంత్రి మోదీ, ఆయన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రధానమంత్రి మోదీ గారికి నిజంగా మన దేశ రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే, ఉత్తరాఖండ్‌లో ఈ నేరానికి పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, ఎస్సీ, ఎస్టి చట్టం

కింద కఠినమైన చర్యలు తీసుకునేలా చూడాలి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి గ్రామ సర్పంచ్ చీదురు శంకర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాసాని సుధాకర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లందాసు రంగయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బోట్ల కనకరాజు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు కందికట్ల భాస్కర్, అన్నారం సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ పర్వతగిరి పట్టణ అధ్యక్షులు నరేడ్ల సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, రావూరు ఉపసర్పంచ్ కొమ్ము రమేష్, చీదురు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు మెరుగైన వసతులు

ఎండబెట్ల పాఠశాలలో అదనపు తరగతి గది ప్రారంభించిన ఎమ్మెల్యే కూచికుళ్ళ రాజేష్ రెడ్డి

నాగర్‌కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా కలం): విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే డా కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ శ్రీమతి తీగల సునేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటే విద్యార్థులు మరింత ప్రశాంతమైన వాతావరణంలో విద్యనభ్యసించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఎండబెట్ల పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన తరగతి గదులు అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థుల సహకారం అవసరమని పేర్కొన్నారు. అదనపు తరగతి గది అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధులను కోరారు.

జర్నలిస్టులకు రైల్వే పాసులు మంజూరు చేయాలి

– కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు రైల్వే పాసులు మంజూరు చేయాలని కోరుతూ జర్నలిస్టులు సోమవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తుందని, రైల్వే పాసులు మంజూరు చేస్తే జర్నలిస్టులకు ఎంతో

ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లి వార్తా సేకరణ చేసే సమయంలో రైల్వే ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి అర్హులైన జర్నలిస్టులకు రైల్వే పాసులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరారు.

తానూర్ మండలంలో కొత్త రేషన్ కార్డుల జాప్యం

- తక్షణమే మంజూరు చేయాలని మాజీ ఎంపీటీసీ వినతి

- మొగిలి గ్రామంలో రేషన్ కార్డుల పెండింగ్ వల్లే ప్రజల ఇబ్బందులు

- 'ప్రజావాణి'లో అధికారులకు వినతిపత్రం అందజేత

తానూర్, ఆగస్టు 31(ప్రజా కలం): తానూర్ మండలంలోని మొగిలి గ్రామంలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు, కొత్త కార్డులు మంజూరు కాకపోవడంతో నిరుపేద కుటుంబాలు బియ్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు, ఈ సమస్యపై స్పందించి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఆయన సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు తానూర్ తహసీల్దార్లకు ఉద్దేశించి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు, అధికారులు వెంటనే స్పందించి అర్హులైన నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోలూర్‌లో ఏఎస్పీ పర్యవేక్షణలో పోలీసుల మెరుపు తనిఖీలు

- ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్

తానూర్, ఆగస్టు 31(ప్రజా కలం): నేరాల నియంత్రణే లక్ష్యంగా బైంసా ఏఎస్పీ సాయికిరణ్ రంగంలోకి దిగారు,జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు తానూర్ మండలంలోని కోలూర్ గ్రామంలో సోమవారం వేకువజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు, ఏఎస్పీ సాయికిరణ్ స్వయంగా పాల్గొని తనిఖీలను పర్యవేక్షించారు, ముథోల్ సీఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గ్రామంలోని ఇళ్లను, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి,అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, నేరాలను నియంత్రించడం, శాంతిభద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు,ఈ సందర్భంగా ఏఎస్పీ సాయికిరణ్ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు,నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని పోలీసులు తెలిపారు, ప్రజల భద్రతకు నిరంతరం అప్రమత్తంగా ఉంటామని పేర్కొన్నారు,ఈ తనిఖీల్లో ఎస్సైలు షేక్ జుబేర్, ప్రదీప్, బిట్ల పెర్సిస్, స్థానిక సర్పంచ్ బి.మాధవరావు, పోలీసు అధికారులు, సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఝరి(బి) గ్రామానికి రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మించాలి: కలెక్టర్‌కు వినతి

తానూర్,ఆగస్టు 31(ప్రజా కలం): మండలంలోని ఝరి(బి) గ్రామం నుండి ఝరి తాండ వరకు రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు, వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించి గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు, విద్యార్థులు, రైతులు, గర్భిణులు ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు,పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి, తక్షణమే నిధులు మంజూరు చేయాలని దొంతుల రమేష్, మాధవ్, షేక్ అమీర్ కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కూచికుళ్ళ రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ ఆగస్టు 31 ప్రజా కలం (ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్

ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిలుక వివేక్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, మల్లయ్య గౌడ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యా, వైద్య రంగాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

– ఆర్డీవో అర్చనకు సీపీఎం పార్టీ నాయకుల వినతి

నాగర్‌కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా కలం): జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలతో పాటు విద్యా, వైద్య రంగాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతను నివారించి అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యే విధంగా ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. అదేవిధంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై అధికారులు

ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు సీపీఎం పార్టీ ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, మండల కమిటీ సభ్యులు మధు, నాయకులు సత్యనారాయణ, కాశన్న, కురుమయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు బంద్.. ఆటోలే దిక్కు!

నాలుగు రోజులుగా బిజ్వారం విద్యార్థుల అవస్థలు.. గద్వాలకు ఆటోల్లో ప్రయాణం

గద్వాల ప్రతినిధి ఆగస్టు 31 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం వరిధిలోని బిజ్వారం గ్రామానికి గత నాలుగు రోజులుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గద్వాల పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు సమయానికి బస్సు రాకపోవడంతో ఆటోల్లో గద్వాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆటో ఛార్జీల భారం పడటంతో పాటు, ఎక్కువ మంది విద్యార్థులు ఒకే వాహనంలో ప్రయాణించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా బిజ్వారం గ్రామానికి బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించి, ఉదయం వేళల్లో నిర్ణీత సమయానికి బస్సు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

నూతన పోలీస్ వెల్ఫేర్ సంఘం కమిటీకి ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్ జి. పాటిల్ అభినందనలు

నాగర్‌కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా కలం): పోలీస్ సిబ్బంది సంక్షేమం వారి సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన పోలీస్ వెల్ఫేర్ సంఘం కమిటీ సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్ జి. పాటిల్ సూచించారు. పోలీస్ వెల్ఫేర్ సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కమిటీ సభ్యులను ఎస్పీ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంఘం చొరవ చూపాలని అన్నారు. ప్రతి పోలీస్ ఉద్యోగికి న్యాయం జరిగేలా ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా సహోదర భావంతో ఐక్యంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ చిన్ను నాయక్ ఎన్నిక కాగ ఉపాధ్యక్షులుగా నాగర్‌కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, తాడూర్ ఎస్సై రాములు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం

ఉద్యోగ సంబంధిత సమస్యలు విధుల్లో ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం వంటి అంశాలపై సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సంఘం రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావడంతో పాటు పోలీస్ శాఖలో సిబ్బంది మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని ఎస్పీ అన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేసి వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది, పోలీస్ వెల్ఫేర్ సంఘం నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊకె శిరీష మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి – ఆదివాసి మహిళ మరణం అత్యంత బాధాకరం

ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఆదివాసి మహిళను అతి కిరాతకంగా చంపారు

అగ్రవర్ణ మహిళా కి ఒక న్యాయం ఆదివాసి మహిళకు మరొక న్యాయం

ఆదివాసి మహిళలకు భద్రత కరువైంది – ఆదివాసీ మంత్రి సీతక్క ఘటనపై స్పందించాలి

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఆగస్టు 31

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష హైదరాబాదు నగరంలోని తుక్కుగూడెం లో ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సుగా పనిచేస్తున్న శిరీషను కొంతమంది దుండగులు అతి కిరాతకంగా హతమార్చారని ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి మహాజన సమితి ఆదివాసీ మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆదివాసీ మహిళను కొంతమంది దుండగులు అతికిరాతంగా చంపడం అత్యంత బాధాకరమని వారు ఆవేదన చెందారు. హైదరాబాద్ తుక్కుగూడ లో ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సుగా పనిచేస్తున్న శిరీషను టార్గెట్ చేసి అత్యంత దారుణంగా చంపటం మానవ సమాజం తలదించుకునేలా ఉందని వారు పేర్కొన్నారు. ఆదివాసి మహిళలు ఎక్కడున్నా భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ధ్వజమెత్తారు. ఆదివాసి మహిళల పట్ల చిన్న చూపు కొనసాగుతూ ఉందని వారు దుయ్యబట్టారు. అదే అగ్రవర్ణ మహిళలైతే విచారణ వెంటనే జరిగేదని బాధ్యులను శిక్షించే వారిని ఆదివాసి మహిళ కాబట్టి ప్రభుత్వం స్పందించట్లేదని వాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైతే బాధ్యులు ఉన్నారు వారిని తక్షణమే ఉరితీయాలని ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన నిజాలు నిగ్గు తేల్చాలని లేదంటే ఆదివాసీ మహిళల ఆగ్రహానికి గురిగాక తప్పదని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల అండదండలు ఉండాలని వారు పేర్కొన్నారు. ఆదివాసీ మహిళలకు అడుగడుగున పోలీసులు పహారాకాయాలని వారు పనిచేస్తున్న ఏరియాలలో సమగ్రంగా సెక్యూరిటీ నిర్వహించాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఓఆర్‌సీల ద్వారా భూములకు పట్టాలు ఇవ్వాలి

– ప్రజావాణిలో ఎంపీడీవోకు సీపీఐ(ఎం) వినతిపత్రం

నాగర్ కర్నూల్ ఆగస్టు 31 ప్రజా కలం (ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జనుంపల్లి గ్రామంలోని దళిత రైతుల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) జనుంపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ గ్రామంలోని దళితుల భూములకు సంబంధించి గతంలో ఓఆర్‌సీలు మంజూరైనప్పటికీ, నుంచి సుమారు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు భూములకు పట్టాలు చేయలేదని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. పట్టాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీసం రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఆర్‌సీల ద్వారా భూములు పొందిన అర్హులైన లబ్ధిదారులందరికీ తక్షణమే పట్టాలు మంజూరు చేసి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జనుంపల్లి గ్రామ కార్యదర్శి పి. శివశంకర్, గ్రామంలోని భూ లబ్ధిదారులు, రైతులు, వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

42 ఏళ్ల అంకిత భావంతో చేసిన సేవకు ఘన సన్మానం

రిటైర్మెంట్ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తికి ఘనంగా వీడ్కోలు

నాగర్‌కర్నూల్ ఆగస్టు 39 (ప్రజా కలం):తెలంగాణ రాష్ట్ర ఫైర్ సర్వీసెస్‌లో 42 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించిన నాగర్‌కర్నూల్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి గారి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో సుదీర్ఘకాలం సేవలందించిన కృష్ణమూర్తి గారిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి గారిని శాలువాతో సత్కరించి, ఆయన 42 ఏళ్ల సేవలను కొనియాడారు. అగ్నిప్రమాదాలు, విపత్తులు సంభవించిన సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలను రక్షించడంలో ఫైర్ సిబ్బంది అందించే సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. కృష్ణమూర్తి తన ఉద్యోగ జీవితంలో విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేశారని చైర్మన్ అన్నారు. ఆయన సేవలు తోటి సిబ్బందికి, యువ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం కృష్ణమూర్తి గారు ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్ ను సన్మానించారు ఫైర్ సిబ్బంది కూడా కృష్ణమూర్తితో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హర్షవర్ధన్ రెడ్డి, ఫైర్ సిబ్బంది, సిబ్బంది కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం..

– ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ

– సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్‌రెడ్డి

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా కలం: గద్వాల నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంచుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ శిరీష కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి నర్సింహ, వార్డు సభ్యుడు శివ, ఉపాధ్యాయులు జయలక్ష్మి, సువర్ణ, రమేష్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బండ్ల

– గద్వాల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక వినతి

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం అలంపూర్‌లోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కేంద్రమంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. గద్వాల జిల్లా అభివృద్ధి, రైల్వే సౌకర్యాల విస్తరణ, ప్రజలకు మెరుగైన రవాణా వసతుల కల్పన తదితర అంశాలపై కేంద్రమంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు, అదనపు రైళ్లకు స్టాపింగ్, రైల్వే ప్రాజెక్టుల విస్తరణ వంటి అంశాలకు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చదువే భవిష్యత్తుకు బాట..

విద్యార్థులకు సర్పంచ్ అండ!

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా కలం:

మల్దకల్ మండలం పరిధిలోని దాసరిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను

గ్రామ సర్పంచ్ పూజారి వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు కోసం గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి అరవింద్ పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

తానూర్,ఆగస్టు 31(ప్రజా కలం): మండలంలోని హంగిర్గ పాఠశాలలో చదివిన ఎల్.ఎల్.బి పట్టభద్రుడు శీతల్కర్ అరవింద్, తన తొలి అక్షరం నేర్చిన బడికి రూ,15 వేలు విలువైన ప్రొజెక్టర్ను సోమవారం అందజేశారు, ఈ సందర్భంగా పాఠశాలకు సేవ చేయడం ఆనందంగా ఉందని అరవింద్ తెలిపారు,ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ నరేందర్, తన పూర్వ విద్యార్థి అరవిందు ఘనంగా సన్మానించి అభినందించారు, చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు ఉన్నాయని గురువు ప్రశంసించగా, ఆయన ప్రోత్సాహమే కారణమని అరవింద్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి శ్రీ మంజీందర్ సింగ్ సిర్సా తో సెప్టెంబర్ 3న పర్యావరణవేత్త కడవెండి వేణుగోపాల్ భేటీ

ఖమ్మం ఆగష్టు 31(ప్రజా కలం న్యూస్)

దేశం ఎదుర్కొంటున్న తీవ్ర పర్యావరణ సంక్షోభం నేపథ్యంలో, ప్రముఖ పర్యావరణవేత్త శ్రీ కడవెండి వేణుగోపాల్ ఢిల్లీ ప్రభుత్వ గౌరవనీయ పర్యావరణ , అటవీ మరియు వన్యప్రాణి శాఖ మంత్రి శ్రీ సర్దార్ మంజీందర్ సింగ్ సిర్సా సెప్టెంబర్ 3, 2026 మధ్యాహ్నం 3:00 గంటలకు , గది నం. 810 , 8వ అంతస్తు , ఏ - వింగ్, ఢిల్లీ సచివాలయం, ఐ.పి. ఎస్టేట్, న్యూఢిల్లీ లో కలవనున్నారు . ఈ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం. పర్యావరణం తీవ్ర సంక్షోభంలో ఉంది . భవిష్యత్ తరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది . ప్రస్తుతం జరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు , ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం, జల కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం అతిగా ఉండటం వల్ల తీవ్ర అనర్థాలు , అనారోగ్యాలు సంభవిస్తున్నాయి . దేశం తీవ్ర నష్టానికి గురవుతోంది, ప్రజలు రోగాల పాలవుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని శ్రీ కడవెండి వేణుగోపాల్ గతంలో గౌరవ ప్రధానమంత్రి కి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలను బంద్ చేయాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే కర్ణాటక గవర్నర్ ని మరియు గోవా గవర్నర్ ని కలిసి వినతి పత్రాలు అందజేశారు . ఢిల్లీ పర్యావరణ మంత్రి తో చర్చించనున్న ప్రధాన అంశాలు : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీలను పూర్తిగా నిషేధించి మూసివేయడం . ఢిల్లీలో వాయు కాలుష్యం , జల కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు . ప్లాస్టిక్ రహిత ఢిల్లీ కోసం ప్రజల్లో చైతన్యం మరియు కఠిన అమలు . అడవులు మరియు వన్యప్రాణుల సంరక్షణ . ఈ సందర్భంగా శ్రీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఢిల్లీ కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది . ఇప్పుడు మనం చర్యలు తీసుకోకపోతే మన పిల్లలకు రోగగ్రస్త భూమిని వదిలిపెడతాం . సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను మూలాల్లోనే , అంటే ఫ్యాక్టరీల వద్దనే నిషేధించడమే శాశ్వత పరిష్కారం అని అన్నారు .

కూసుమంచి ప్రజావాణిలో ఖాళీ కుర్చీలు...

ప్రజా సమస్యలు పరిష్కరించేదెవరు ?

పాలేరు ఆగస్టు 31(ప్రజా కలం న్యూస్)కూసుమంచి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, నోడల్ అధికారి హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలకే వినతిపత్రం అందించిన పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇంచార్జి, 8వ వార్డు సభ్యుడు గుండా ఉపేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కూసుమంచి ప్రధాన రహదారిపై ఆక్రమణలు, రోడ్డుపై వ్యాపారాల కారణంగా ప్రజలు, ముఖ్యంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.ప్రజావాణి కార్యక్రమానికే అధికారులు హాజరుకాకపోవడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని ఉపేందర్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రజావాణికి అధికారులు హాజరయ్యేలా, ప్రజలు సమర్పించే ఆర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు చెరుకుపల్లి వీరయ్య, 5వ వార్డు సభ్యురాలు మంద నవ్య, చంద్రశేఖర్ గౌడ్, గోపే విజయ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లిలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఘన వీడ్కోలు

- శాలువాలతో సత్కరించిన వ్యాపారులు, పాత్రికేయులు

ఆళ్లపల్లి, ఆగస్టు 31 (ప్రజాకలం) ఆళ్లపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా ఐదేళ్లకు పైగా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన సీహెచ్. వెంకటేశ్వర్లుకు స్థానిక వ్యాపారులు, గ్రామస్తులు, పాత్రికేయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. స్థానిక ఎస్ఐ సోమేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వ్యాపారవేత్తలు గౌరీశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, నరేడ్ల వెంకన్న, బూరుగడ్డ రాములు, నరేడ్ల శ్రీనివాసరావు, నువ్వుల నరసింహారావు, వివిధ పత్రికల విలేకరులు బోడకుంట్ల బిక్షం, మహమ్మద్ ఫయీం, పరమ ప్రభాకర్, బూరుగడ్డ సత్యరాజు, సదానందచారి, మహమ్మద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఆళ్లపల్లి మండల పరిధిలోని అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐదేళ్లకు పైగా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన ఆయన ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మెలిగారని తెలిపారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న వెంకటేశ్వర్లు, ఆళ్లపల్లి ప్రజలతో కుటుంబ సభ్యుడిలా మమేకమై మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. ఆయన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. పదవి విరమణ అనంతరం వెంకటేశ్వర్లు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, వ్యాపారులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డులపై మోదీ ఫొటో ముద్రించాలి

సన్న బియ్యం మాత్రమే సరఫరా చేయాలి : కూసుమంచి బీజేపీ డిమాండ్

పాలేరు ఆగస్టు 31(ప్రజా కలం న్యూస్)

కొత్తగా జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ముద్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్న బియ్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని బీజేపీ కూసుమంచి మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న ఉచిత రేషన్ పథకం ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ముద్రించాలని, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సన్న బియ్యం పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ మహేందర్ నాయక్, పగర్తి సుధాకర్, వడ్డెపూడి నరేష్, దీవాకర్, కోటేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనతోనే సాధ్యం

గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి

గజ్వేల్:31 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సామాజిక న్యాయం సాధించాలంటే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి అన్నారు.నిజామాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పంచాజన్య సభ'కు హాజరయ్యేందుకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

నిజామాబాద్‌లో నిర్వహించనున్న పంచాజన్య సభలో కీలక ప్రకటనలు వెలువడనున్నాయని, ఈ సభ ప్రజల్లో కొత్త ఆశలు నింపుతుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధించడంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వం కీలకమని అన్నారు.విద్య,వైద్యం, వ్యవసాయం,ఉపాధి తదితర రంగాలకు సంబంధించి స్పష్టమైన హామీలు సభలో ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన అన్ని పదవులను త్వరలో భర్తీ చేస్తామని కొట్టాల యాదగిరి వెల్లడించారు.పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,లిగాని రాజు,నరేందర్ రెడ్డి, రాజు,స్వామి, సుధాకర్,రాజలింగం, మధు,కుమార్‌తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాచగిరి అభివృద్ధికై మాస్టర్ ప్లాన్ సిద్ధం

- నిధులు ఇవ్వని బిఆర్ఎస్ సర్కార్

శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆగ్రహిస్తే ఎంతటి వారైనా పతనం తప్పదు...

కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యం దురదృష్టకరం

నాచగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్

గజ్వేల్ నియోజకవర్గం:
31 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్ర అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్,తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు,గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాచగిరి ఆలయశీ దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.ఎంతో ప్రాచీన, ప్రాముఖ్యత,ప్రాశస్త్యం కలిగి రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందిన నాచగిరి క్షేత్ర అభివృద్ధిపై శీతకన్ను ప్రదర్శిస్తుండగా,గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ 100 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి,స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ నిధులు ఇవ్వ చేయలేదని గుర్తు చేశారు. ఆలయ అభివృద్ధి, నిధుల విడుదల కోసం తాను ఎంత ప్రయత్నించినా అప్పటి మంత్రులు,అధికారులు సహకరించలేదని విమర్శించారు. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని భావించగా, నిధుల విడుదలకు బిఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఆ పాపం మూటగట్టుకున్నట్లు తెలిపారు. స్వామివారి ఆగ్రహంతోనే వారికి ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆలయ అభివృద్ధికి నిధులు వెచ్చించాల్సి ఉండగా,మాటలకే పరిమితమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆస్తులు కాపాడాలని,భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు,ప్రజలను చైతన్యం చేసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సంచార తెగల అభ్యున్నతికి

ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

నిర్మల్ ఆగస్టు 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన సంచార, విముక్త తెగల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

సంచార తెగల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వాలు అందించే పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. సంచార జాతుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజంలో వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్వేత గృహప్రవేశంలో సూర్య ప్రకాశ్‌రెడ్డి

ఆత్మీయంగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ అసిస్టెంట్

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా కలం:

గద్వాల పట్టణం వేణు కాలనీలో పంచాయతీ కార్యదర్శి శ్వేత నూతన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాశ్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి నూతన గృహ నిర్మాణంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్

నిర్మల్ ఆగస్టు 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫోన్లకే ప్రాధాన్యం..!

తానూర్‌లో అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి

నిర్మల్ ఆగస్టు 31 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తానూర్‌లో ఆశించిన స్థాయిలో సాగలేదని పలువురు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలతో అధికారులు సరిగా మాట్లాడకుండా ఫోన్లలో నిమగ్నమై ఉన్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలు వినడమే ప్రజావాణి ప్రధాన ఉద్దేశమని, ఇలాంటి కార్యక్రమాల్లో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ ఈ అంశంపై దృష్టి సారించి, మండల స్థాయిలో ప్రజావాణి సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఔషధాలపై పరిశోధన.. రాజేందర్ రెడ్డికి పీహెచ్‌డీ..

- క్యాన్సర్ ఔషధాల నాణ్యతపై కీలక అధ్యయనం..

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ప్రజా కలం)ప్రతినిధి

క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే ఔషధాల నాణ్యత, భద్రతను మెరుగుపరిచే దిశగా పరిశోధన చేసిన గీతం హైదరాబాద్ విజ్ఞాన పాఠశాల రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వై. రాజేందర్ రెడ్డి పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించారు. ఇబ్రూటినిబ్, బుసల్ఫాన్, లాపటినిబ్, రుక్సోలిటినిబ్ ఔషధాల్లోని మలినాలు, విచ్ఛిన్న ఉత్పత్తులను గుర్తించి వాటి నిర్మాణాలను విశ్లేషించే అంశంపై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఔషధాల స్థిరత్వం, నాణ్యతను అంచనా వేసేందుకు అధునాతన విశ్లేషణ పద్ధతులను అభివృద్ధి చేసినట్లు పరిశోధన మార్గదర్శకుడు ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు తెలిపారు. రాజేందర్ రెడ్డి పీహెచ్.డీ.కి అర్హత సాధించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, నివాస సంచాలకుడు డీవీవీఎస్ఆర్ వర్మ, విజ్ఞాన పాఠశాల సంచాలకుడు డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు..

ప్రజావాణిలో రెవెన్యూ సెగ!

-8 ఫిర్యాదులు.. రెవెన్యూపైనే 5 పిటిషన్లు..

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం

పొందేందుకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 8 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖ తహసీల్దార్‌కు సంబంధించిన సమస్యలపై 5 ఫిర్యాదులు రాగా, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు సంబంధించి 2 దరఖాస్తులు, నీటిపారుదల శాఖ సహాయ ఇంజినీర్‌కు సంబంధించి 1 దరఖాస్తు అందింది. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా పరిశీలించనున్నట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో పటాన్‌చెరు తెలిపారు..

హిందూ పండుగల వేళ ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

పండుగ ముగిసినా అదనపు ఛార్జీలు వసూలు చేయడం సరికాదు

బీజేపీ నేత నాయిని సందీప్ కుమార్ ఆగ్రహం

గజ్వేల్:31 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

హిందూ పండుగల సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ అదనపు ఛార్జీల పేరుతో ప్రయాణికులపై భారం మోపడం దారుణమని గజ్వేల్ పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాఖీ పండుగ ముగిసి మూడు రోజులు గడిచినా అదనపు ఛార్జీలను తగ్గించకపోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం నాయిని సందీప్ మాట్లాడుతూ హిందూ పండుగలు వచ్చిన ప్రతిసారీ ప్రయాణికులపై ఆర్టీసీ ఛార్జీల భారం మోపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. సాధారణ రోజుల్లో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు బస్సు ఛార్జీ రూ.90 ఉండగా, పండుగ స్పెషల్ పేరుతో ఒక్కో టికెట్‌కు రూ.140 వసూలు చేస్తున్నారని తెలిపారు. పండుగలు ముగిసినప్పటికీ అదనపు ఛార్జీలు వసూలు చేయడం వల్ల సామాన్య,మధ్యతరగతి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం మోపడం తగదని పేర్కొన్నారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకుని యథావిధిగా సాధారణ ఛార్జీలనే అమలు చేయాలని నాయిని సందీప్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రయాణికులు,ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇస్నాపూర్‌కు రూ.3.40 కోట్ల అభివృద్ధి జోరు

-3 వార్డుల్లో భారీ పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన..

పటాన్‌చెరు,ఆగస్టు 31 (ప్రజా కలం)ప్రతినిధి

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.3.40 కోట్లతో చేపట్టనున్న పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఇస్నాపూర్,చిట్కుల్, లకడారం వార్డుల్లో రహదారులు, డ్రైనేజీలు,పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పాండు,నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు రాహుల్ రెడ్డి, సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, ఈశ్వరమ్మ,జనార్దన్ రెడ్డి, ఆంజనేయులు, మమత అరుణ్,రాజు,లత వెంకటేష్, సహ-ఎంపిక సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సోనియా రాజు, నిజాముద్దీన్ బాబా, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేరాజ్ ఖాన్, కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు..

మెనూ మారితే ఊరుకోం!

-విద్యార్థుల భోజనంపై కలెక్టర్ 'స్పెషల్ నజర్'

-మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

వేములవాడ, ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని గుడిచెరువు సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా విద్యాలయం లోని డైనింగ్ హాల్‌ను పరిశీలించి.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? భోజనం నాణ్యత ఎలా ఉందనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు అవసర మైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యాలయంలో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో వైభవంగా శ్రావణమాసం పూజలు

నేడు ఆలయ వార్షికోత్సవ వేడుకలు

గజ్వేల్:31 ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం లయన్ నేతి శ్రీనివాస్--పావని దంపతులు, నంగునూరి రాములు--శివలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్ గురుస్వామి, ఆర్యవైశ్య సీనియర్ నాయకులు ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి మాట్లాడుతూ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గజ్వేల్‌లో ఎక్కడా లేనివిధంగా శ్రావణమాసం నెల రోజుల పాటు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పూజలు నిర్వహిస్తున్న దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులపై స్వామివారి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నేడు మంగళవారం నిర్వహించనున్న శ్రీ హరిహర అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్,ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, కోశాధికారి నారాయణరెడ్డి,కార్యదర్శి గోపి, నంగునూరి నవీన్,నిహారిక, అవ్యక్త,ఆలయ పురోహితులు జితేంద్ర త్రిపాఠి, నాయకులు మర్యాల శ్రీనివాస్, గందే యాదగిరి,సిద్ధి రామచంద్రం,కైలాస ప్రశాంత్,అంజయ్య, డెంటల్ శ్రీనివాస్,రాంబాబు, ఆంజనేయులు, దీపక్, విక్రాంత్,గందె సంతోష్‌తో పాటు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ పంట నమోదు ఖచ్చితంగా చేపట్టాలి

మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 31.

రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న డిజిటల్ పంట నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు చేపడుతున్న పంటల నమోదును పరిశీలించి, రైతుల పొలాల్లో సాగులో ఉన్న పంట, పంట విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాలను వాస్తవ సాగుకు అనుగుణంగా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పంట మార్పిడి జరిగిన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన పంట వివరాలను నమోదు చేయాలని తెలిపారు. డిజిటల్ పంట నమోదు ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు, ఇతర ప్రయోజనాలను పారదర్శకంగా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు సన్న రకాల వరి పంటలను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048), సాంబా మసూరి (బీపీటీ-5204), కునారం సన్నాలు (కేఎన్ఎం-1638), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, సిద్ధి (డబ్ల్యూజీఎల్-44), కేఎన్ఎం-7715 రకాలు ఇందులో ఉన్నాయని వివరించారు. డీలర్ల వద్ద కొనుగోలు చేసిన సన్న రకాల విత్తనాలు నమోదు కాకపోతే, రైతులు డీలర్ ఇచ్చిన బిల్లుతో వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా సంబంధిత డీలర్‌ను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో పంటల నమోదు ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, సర్వేయర్ అనిల్, రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:31ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా అధికారులను

ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల వారీగా ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల వివరాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేందుకు ప్రజావాణికి వస్తారని తెలిపారు. ప్రజల్లో ఆ నమ్మకాన్ని మరింత పెంపొందించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి,వీలైనంత త్వరగా డిస్పోజల్ చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా, సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ప్రజల నుంచి ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుంచి మొత్తం 103 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ఎస్‌డీసీ సుదర్శన్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, అకాలీదళ్ పొత్తు

ఛండీఘడ్ : పంజాబ్ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈసారి ఎలాగైనా అక్కడ అధికారం చేజిక్కించుకోవాలని పావులు వేగంగానే కదుపుతోంది. అయితే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీ.ఎల్. సంతోష్ ఓ కీలక ప్రకటన చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. అయినా? అటు బీజేపీ, ఇటు అకాలీదళ్ పొత్తు కోసం ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. అడపా దడపా ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతూనే వున్నాయి. కానీ.. ఓ పట్టాన తుది దశకు రావడం లేదు. ఇంత జరుగుతున్నా.. పొత్తుపై రెండు పార్టీలూ ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. అయితే.. ఇరు పార్టీల మధ్య పొత్తు వుండాలన్న తుది నిర్ణయానికి మాత్రం వచ్చేశాయి. ఈ సారి బీజేపీ అక్కడ పై చేయి సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తానే సీనియర్ భాగస్వామిగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యింది. దీంతో అకాలీదళ్ అటూ ఇటూగా వున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సీనియర్ భాగస్వామి అయితే మాత్రం సీట్ల విషయంలో దెబ్బే.. అన్నట్లుగా ఆలోచిస్తోంది. ఎక్కువ సీట్లు అడగడానికి అకాలీదళ్ కి ఛాన్స్ వుండకపోవచ్చు. అయితే.. పొత్తుకు అవకాశం ఉందనడానికి ఒక కీలక సూచన ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాల్లోని సీట్లకు సిద్ధం కావద్దని ఎస్ఏడీ తమ నాయకులకు సూచించినట్లు సమాచారం. దీనిని బట్టి, గత పొత్తులో కంటే బీజేపీ ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంతలో, పంజాబ్‌లో బీజేపీ తన సంస్థాగత సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా, మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సన్నద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ఐడీఓసీ ప్రజావాణికి 162 దరఖాస్తులు.

సిరిసిల్ల, ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) :

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 162 అర్జీలు అందగా.. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి సకాలంలో పరిష్కరించాలని సూచించారు, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆర్డీఓ కార్యాలయాల్లో 8 అర్జీలు...

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలోనూ నాలుగు అర్జీలు అందాయి. సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

మండలాల్లోనూ స్వీకరణ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. ఎంపీడీఓలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు,మండలాల వారీగా దరఖాస్తులు: బోయినపల్లి 7, చందుర్తి 0, ఇల్లంతకుంట 8, గంభీరావుపేట 10, కోనరావుపేట 8, ముస్తాబాద్ 20, రుద్రంగి 0, తంగళ్లపల్లి 12, వీర్నపల్లి 7, వేములవాడ అర్బన్ 6, వేములవాడ రూరల్ 4, ఎల్లారెడ్డిపేట 8 చొప్పున దరఖాస్తులు వచ్చాయి,ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

-దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

-రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు, వేములవాడ రూరల్, అర్బన్ మండలాల్లో నూతనంగా ఎంపికైన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ. 20,650 కోట్ల రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలకు కొత్త రేషన్‌కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు,

గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మ మభ్యపెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇళ్లను మంజూరు చేసి పేదల కోసం ఇళ్ల నిర్మాణం చేపడుతోందన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని.. అయితే అసత్య ప్రచారం చేసే హక్కు లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఇచ్చే పిలుపులు, ప్రసంగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు, గ్రామాల్లో వచ్చే సమస్యలపై వాస్తవ సమాచారంతో ప్రజలకు సమాధానం ఇవ్వాలని తెలిపారు. ప్రతిపక్షాల ప్రచారంపై సందేహాలుంటే మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తనను సంప్రదించి సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు, తెలంగాణలో చేపడుతున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల, జిల్లా, గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం గతంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను అభినందించారు. ప్రతి గ్రామ నాయకుడు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండి పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

1,000 రోజులు గడిచినా

కాంగ్రెస్ హామీల అమలు ఏది?

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 31,(ప్రజా కలం)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 1,000 రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం కార్యక్రమాలు, సభలు, ప్రచార కార్యక్రమాలతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. ప్రజలు మాత్రం తమ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. రైతులకు బీమా, రైతు సంక్షేమం పేరుతో హామీలు ఇచ్చినప్పటికీ వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం

కనిపిస్తోందన్నారు. రైతు కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. అదేవిధంగా కార్మికులు, పేదలు, మహిళలు, నిరుద్యోగులు, గ్రామీణ ప్రజలు సహా వివిధ వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని అన్నారు. హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సేకరించి, సంబంధిత అధికారులకు అందించి, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా కృషి చేశామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని అన్నారు.

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఓట్లు పొందిన తర్వాత వాటిని మరిచిపోవడం ప్రజలను మోసం చేయడమే" అని ఆమె అన్నారు.

ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేయడానికి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు -- వాటి ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సభలు, సమావేశాలు నిర్వహించడం కాకుండా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ప్రభుత్వం ప్రజల ముందుంచాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ప్రభుత్వంపై ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజల తరఫున పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కల్చరల్ సెల్ సభ్యునిగా సిద్ధోజు మాధవాచారి నియామకం

అందరు సహకారంతో పార్టీ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తా

మహేశ్వరం, ఆగస్టు 31:(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులు, మహేశ్వరం మండల సీనియర్ నాయకులు సిద్ధోజు మాధవాచారి ని బీజేపీ రాష్ట్ర కల్చరల్ సెల్ - జన చైతన్య కళామండలి సభ్యునిగా నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ నాగపురి రాజమౌళి గారు నియామక పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు కి , రాష్ట్ర కల్చరల్ సెల్ కన్వీనర్ నాగపురి రాజమౌళికి, రాష్ట్ర కల్చరల్ కమిటీ సభ్యులకు, రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులకు, ప్రతి కార్యకర్తకు మాధవాచారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నాకు అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తాను. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రంలో చేస్తున్న అభివృద్ధి పనులు, పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి చేస్తున్న కృషిని, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తాను. తెలంగాణలో, ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కళా రూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తాను" అని అన్నారు. సిద్ధోజు

మాధవాచారి రాజకీయ ప్రస్థానం:

మొదట ఆర్ఎస్ఎస్ లో శారీరక్ ప్రముఖ్ గా సేవలందించారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి రెండుసార్లు ఉప సర్పంచ్ గా, ఒకసారి సర్పంచ్ గా పనిచేశారు. బీజేపీలో మహేశ్వరం మండల ఉపాధ్యక్షునిగా, రెండుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు మండల కిసాన్ మోర్చా అధ్యక్షునిగా, రంగారెడ్డి జిల్లా జన చైతన్య కళామండలి ప్రధాన కార్యదర్శిగా, కన్వీనర్ గా, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు, మహేశ్వరం మండల అధ్యక్షునిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ గా కొనసాగుతున్నారు.

కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అబాండెడ్ వాహనాలు

-యజమానులకు పోలీసుల విజ్ఞప్తి చేసిన

-కందుకూరు సి ఐ వెంకటేశ్వర్లు

కందుకూరు, ఆగస్టు 31,(ప్రజా కలం)

కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన మూడు అబాండెడ్ వాహనాల యజమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రస్తుతం క్రింది నంబర్లు గల మూడు వాహనాలు అబాండెడ్ గా ఉన్నాయని AP 11 S 0823, AP 09 BA 3645,AP 13 G 8807 పై నంబర్లు గల వాహనాల యజమానులు ఎవరైనా ఉంటే, వీలైనంత త్వరగా కందుకూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి, తమ వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సి) మరియు ఆధార్ కార్డులి వివరాలను సమర్పించి, తమ వాహనాలను తీసుకువెళ్లాలని సి ఐ తెలిపారు. గడువులోగా ఎవరూ సంప్రదించని పక్షంలో, నిబంధనల ప్రకారం సదరు వాహనాలను వేలం (పబ్లిక్ యాక్షన్)వేయడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు. సంబంధిత వాహన యజమానులు వెంటనే కందుకూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

సప్తగిరి కాలనీలో వైభవంగా మహాకాళేశ్వర శివలింగ పూజలు

- స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి ఆగస్టు 31(ప్రజా కలం ప్రతినిధి)

నేరేడ్‌మేట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో వేంచేసియున్న శ్రీ మహాకాళేశ్వర స్వామివారి ఆలయంలో శివలింగ పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన మైనంపల్లి హనుమంతరావుకు ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని,ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్,బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,నాయకులు బీ.కే శ్రీనివాస్,ప్రసాద్, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ నయనపల్లి కనకయ్యతో పాటు కమిటీ సభ్యులు పుట్ట శ్రీనివాస్, కైతి నర్సింగ్, గంగాధర్,గుంటి కృష్ణ, కలకుంట్ల రాములు, పాము వీరేష్, రమణమోని కొండయ్య, కలకుంట్ల శ్రీనాథ్, కలకుంట్ల నవీన్,చింతల శ్రీకాంత్,మహేష్, రాయుడు,ఇందిర ప్రియదర్శిని,ప్రభా, యాదగిరి మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వే భూసేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం.

రాజన్న సిరిసిల్ల ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) : రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, సేకరించిన భూములను సంబంధిత శాఖలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు, రైల్వే లైన్ల నిర్మాణం, డబ్లింగ్ పనులు, స్టేషన్ల ఆధునీకరణ తదితర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు, రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ పాల్గొన్నారు,రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాల వారీగా రైల్వే ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ పరిస్థితి, నిర్మాణ పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయనే అంశాలపై సీఎస్ సమీక్షించారు,ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, నిర్ణీత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కే.ఎస్.బీ. కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.క

రైతులు, పేదల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్

లేమూరు సర్వే నంబర్ 102లో ఇళ్ల స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లను తక్షణమే పూర్తి

మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

మహేశ్వరం, ఆగస్టు 31 (ప్రజా కలం): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ(ఎం) మహేశ్వరం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ అన్నారు.మహేశ్వరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. పెన్షన్లు పెంచుతామని చెప్పి, ఉన్న పెన్షన్లను కూడా తగ్గిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే పెన్షన్లను పెంచాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. మండలంలో నెలకొన్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ హామీపై విశ్వాసంతో ఫ్యాబ్ సిటీ రైతులు 93 రోజుల రిలే దీక్షలను విరమించామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లేమూరు సర్వే నంబర్ 102లో ఇళ్ల స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లను తక్షణమే పూర్తి చేసి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, ఫ్యాబ్ సిటీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోదాసు నరసింహ, ఫ్యాబ్ సిటీ నాయకులు పాలకూర నాగేష్, మునుగని గిరీష్, రమేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

శిరీషకు నివాళులు అర్పించిన ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం

గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులకు కృతజ్ఞతలు

మహేశ్వరం, ఆగస్టు 31 (ప్రజాకలం):

తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఇటీవల చోటుచేసుకున్న దురదృష్టకర ఘటనలో మృతి చెందిన శిరీషకు హాస్పిటల్ యాజమాన్యం ఘనంగా నివాళులు అర్పించింది. ఈ ఘటనపై సత్వరమే స్పందించి, గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసు బృందానికి ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం, తుక్కుగూడ వైద్య యూనియన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాయి.ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ.. "ఘటన జరిగిన సమయంలో మా ఆసుపత్రి

యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి పోలీసులు అందించిన సత్వర సహాయం మరువలేనిది. నిందితుడిని అతి తక్కువ సమయంలోనే పట్టుకోవడంలో పోలీసులు ప్రదర్శించిన వేగం, అంకితభావం అభినందనీయం. ఇది పోలీసు వ్యవస్థ అసాధారణ కృషికి నిదర్శనం.

మీ సత్వర జోక్యం మా ఆసుపత్రికే కాకుండా మొత్తం తుక్కుగూడ వైద్య సమాజానికి ధైర్యాన్ని, భరోసాను ఇచ్చింది. వైద్య సమాజం ఆందోళనలో ఉన్న సమయంలో మీరు స్పందించిన తీరు పోలీసు వ్యవస్థపై, న్యాయ వ్యవస్థపై మా నమ్మకాన్ని మరింత బలపరిచింది" అని పేర్కొన్నారు.అలాగే ఈ కేసులో నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని తగిన శిక్ష పడేలా చూడాలని, ఇది బాధితురాలికి న్యాయం జరగడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడే వారికి హెచ్చరికగా నిలుస్తుందని కోరారు.బాధితురాలు శిరీష కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా అండగా ఉంటామని, ఎలాంటి సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటామని ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.

క్షుద్ర పూజల పేరుతో రూ.62 లక్షలు టోకరా !

- అనారోగ్యం నయం చేస్తామంటూ మహిళకు కుచ్చుటోపి

- చేతబడి గుప్తనిధుల పేరుతోనూ మోసం.. ఇద్దరి అరెస్ట్.

-రూ.30.50 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, పూజా సామగ్రి స్వాధీనం.

- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి. గితే.

రాజన్న సిరిసిల్ల
ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి)

అనారోగ్యాన్ని క్షుద్ర పూజలతో నయం చేస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి ఏకంగా రూ.62 లక్షల వరకు నగదు, బ్యాంకు లావాదేవీల ద్వారా డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడులు, గుప్తనిధుల పేరుతో అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తిం చారు, నిందితుల నుండీ రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, క్షుద్ర పూజలకు వినియోగించే బెల్లంతో తయారు చేసిన రెండు బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు, ఈ వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం మీడియా ముందు వెల్లడించారు,కరీంనగర్ మంకమ్మతో టకు చెందిన తురుపాటి శ్యాం కుమార్ (57) ప్రస్తుతం హైదరాబాద్ తూముకుంటలో 'భద్రకాళి పూజ స్టోర్' నిర్వహిస్తున్నాడు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం (60) తరచూ అతడి వద్ద పూజా సామగ్రి కొనుగోలు చేసేవాడు ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది,అగ్రహారం, పరిసర గ్రామాల్లో క్షుద్ర పూజలు, మంత్రాలు, దిష్టి, చేతబడుల పేరుతో అమాయకులను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నానని లక్ష్మీరాజం శ్యాం కుమార్‌కు చెప్పాడు. తెలిసిన వారిని తన వద్దకు పంపిస్తే పూజల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఇద్దరం సమానంగా పంచుకుందామని ప్రతిపాదించగా శ్యాం కుమార్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఉప్పల్‌కు చెందిన బండారి లత అనే మహిళ జనవరిలో పూజా సామగ్రి కోసం శ్యాం కుమార్ దుకాణానికి వెళ్లింది కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదని అతడికి చెప్పింది దీంతో ఆమెకు దేవుళ్లు, పూజలపై ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న శ్యాం కుమార్.. క్షుద్ర పూజలతో దీర్ఘకాలిక అనారోగ్యాన్ని పూర్తిగా నయం చేయవచ్చని నమ్మించాడు,వేములవాడ అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజం మంత్రాలు, క్షుద్ర పూజలు చేస్తాడని, చాలామందికి నయం చేశాడంటూ ఆమెను నమ్మించాడు ఫిబ్రవరిలో సిరిసిల్ల పాత బస్టాండ్ వద్దకు తీసుకొచ్చి లక్ష్మీరాజంతో పరిచయం చేశాడు,పథకం ప్రకారం లక్ష్మీరాజం కూడా లతను మాటలతో నమ్మించి పూజలు చేస్తే అనారోగ్యం నయం అవుతుందని చెప్పాడు పూజా సామగ్రి కోసం రూ.10 లక్షలు కావాలని కోరగా ఆమె అదే రోజు రూ.10 లక్షలు నగదుగా ఇచ్చింది,అనంతరం వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి పూజల పేరుతో మరింత డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు, యాదగిరిగుట్ట వద్ద రూ.21 లక్షలు, కాశీలో రూ.13 లక్షలు నగదుగా తీసుకున్నారని, శ్యాం కుమార్ సూచించిన బ్యాంకు ఖాతా, ఇతర ఖాతాలకు విడతల వారీగా సుమారు రూ.62 లక్షల వరకు బదిలీ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. కొంత మొత్తాన్ని ఆమెతోనే ఖర్చు చేయించినట్లు పోలీసులు వెల్లడించారు, అంతేకాకుండా తమ మోసం బయటపడుతుందనే భయంతో లత చేత తెల్లకాగితాలపై సంతకాలు కూడా చేయించుకున్నారని పోలీసులు తెలిపారు.అనారోగ్యం నయం కాలేదని, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమె పలుమార్లు కోరగా క్షుద్ర పూజలు, చేతబడులతో ఆమెను, కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు, అదేవిధంగా ఆమె పొలంలో పెద్ద మొత్తంలో గుప్తనిధులు ఉన్నాయని, వాటిని వెలికితీసి ఇస్తామని చెప్పి మరికొంతకాలం నమ్మించినట్లు తెలిపారు. ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల పాత బస్టాండ్‌కు రావాలని చెప్పి ఆమె అక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు రాకుండా మోసం చేశారు.

ఫిర్యాదుతో కదిలిన పోలీసులు..

దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అగ్రహారం గ్రామంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామ గ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసు: క్రైం నం. 478/2026, సెక్షన్లు 318(4), 316(2), 308(5) r/w 3(5) BNS, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్--1954లోని సెక్షన్ 7 కింద సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.నిందితులను పట్టుకోవడం లో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, చేతబడులు, మంత్రాలు పరిష్కారం కాదని ప్రజలు గుర్తించాలని ఎస్పీ సూ చించారు, ఆరోగ్య సమస్యలు ఎదురైన ప్పుడు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలని కోరారు. పూజలు, మంత్రాలు, గుప్త నిధులు లేదా ఇతర మూఢనమ్మకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

భీమేశ్వరుడి సన్నిధిలో భక్తజన సందడి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం.

- క్యూలైన్లలోనే ఉండి ఏర్పాట్లు పరిశీలించిన డీఈవో, ఈఈ

వేములవాడ, ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) :

మూడో సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది.హ, తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ప్రాంగణం భక్తజన సందడితో నిండిపోయింది,స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు, భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం డిప్యూటీ

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) నవీన్‌కుమార్, ఈఈ రాజేష్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు,క్యూలైన్లలో నిలిచి పరిస్థితిని పరిశీలిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశారు,సాధారణ దర్శనంతో పాటు శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్లను అధికారులు పరిశీలించారు,భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దర్శన ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు,టికెట్ కౌంటర్లు, చెక్‌పోస్టుల వద్ద రద్దీ పెరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు, అనంతరం భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు నిర్వహించే కోడె మొక్కుల ప్రాంగణం, అద్దె కోడెల విభాగం, నిత్య అభిషేక మండపాలను అధికారులు పరిశీలించారు. భక్తులకు ఆర్జిత సేవలు, మొక్కుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను డీఈవో, ఈఈ స్వయంగా పలకరించి దర్శనం, సేవల నిర్వహణపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు,భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో ఎస్పీఎఫ్ పోలీసులు, హోంగార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం కల్పించాలని సూచించారు,ఈ పర్యవేక్షణలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, శివసాయి, సీనియర్ అసిస్టెంట్ వంశీమోహన్‌శర్మ, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఆపన్నహస్తం.. రూ.50,016 విరాళం

- ఆంజనేయస్వామి ఆలయానికి ఏనుగు మనోహర్‌రెడ్డి చేయూత.

వేములవాడ, ఆగస్టు 31 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెలో ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి రూ.50,016 విరాళాన్ని అందజేశారు, ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన ఈ మొత్తాన్ని అందించారు, శాత్రాజ్ పల్లెలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం అందజేసినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు సహకరించాలని కోరారు,ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పర వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన ఏనుగు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు, ఈకార్యక్రమంలో మిట్టపల్లి అనిల్‌రెడ్డి, విక్కుర్తి సాయిబాబు, వనపర్తి జగన్, విక్కుర్తి నారాయణ, రేగుల రాజేశం, బూర గణేష్, గుడిసె మనోజ్, అప్పవారి చక్రపాణి, నాగుల శంకర్, వనపర్తి గంగయ్య, దేశెట్టి ఆశయ్య, కొప్పర సంతోష్‌రెడ్డి, నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె సదానందం, నల్ల తిరుపతిరెడ్డి, బొడ్డు కిషన్, గ్రామ కులసంఘాల పెద్దలు, యువకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

11 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)ఆగస్టు 31:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న సిబ్బంది కల నెరవేరింది. కమిషనరేట్‌లో

విధులు నిర్వహిస్తున్న 11 మంది హెడ్ కానిస్టేబుళ్లను అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్ఐ)గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రమోషన్లు పొందిన సిబ్బంది సోమవారం జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య పదోన్నతి పొందిన అధికారులకు బ్యాడ్జీలు తొడిగి, శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు పెరిగినందున మరింత నిబద్ధతతో పనిచేస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా పోలీసింగ్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలని ఆయన సూచించారు. ప్రమోషన్ పొందిన వారిలో నందిపేట్‌కు చెందిన ఎస్.గంగాధర్‌రావు, ఉమెన్ పీఎస్ నుంచి పి.రాజేశ్వర్, సీసీఎస్ నుంచి ఎం.మోహన్, పీసీఆర్ నుంచి బి.జగదీశ్వర్, సీబీఎస్ నుంచి పి.చిన్న సాయిలు, డిచ్‌పల్లి నుంచి జయ రాజశేఖర్, సిరికొండ నుంచి జి.రాజేందర్, నవీపేట్‌కు చెందిన పి.సుదర్శన్, టౌన్ పీఎస్ నుంచి డేనియల్ భాస్కర్, టూ టౌన్ నుంచి కె.సుంకన్న, వారిని పోలీస్ స్టేషన్‌కు చెందిన కె.మల్లేశం ఉన్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పదోన్నతి లభించడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ఏడాది పూర్తి

గణనీయంగా పెరిగిన విద్యార్థుల ప్రతిభ

ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు గణితం, సైన్స్‌లో ఉచిత డిజిటల్ అభ్యసన వనరులు - పాఠశాల విద్యాశాఖ, ఖాన్ అకాడమీ

హైదరాబాద్, ఆగస్టు 31 (ప్రజాకలం) : తెలంగాణ రాష్ట్రంలో గణితం, సైన్స్ విద్యను డిజిటల్ వనరులతో మరింత బలోపేతం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ, ఖాన్ అకాడమీ ఇండియా చేపట్టిన రాష్ట్రవ్యాప్త కార్యక్రమం తొలి ఏడాదిలోనే కీలక మైలురాయిని చేరుకుంది.

2025--26 విద్యా సంవత్సరంలో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉచిత డిజిటల్ అభ్యసన వనరులు అందుబాటులోకి వచ్చాయి.

తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం జూన్ 2025లో ప్రారంభమైంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని సిద్దిపేట్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ జిల్లాలలో దాదాపు 6 వేల పాఠశాలల్లో సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (KGBV), మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సొసైటీ పాఠశాలలు, ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఈ కార్యక్రమంలో భాగమయ్యాయి.



రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో దాదాపు 75 శాతం వరకు కార్యక్రమం విస్తరించింది. విద్యార్థులు గణితం, సైన్స్‌లో క్రమం తప్పకుండా సాధన చేసేలా పాఠశాల విద్యాశాఖ వారపు ఆన్‌లైన్ అభ్యసన మార్గదర్శకాలను అమలు చేసింది.

ఖాన్ అకాడమీ ఇండియా అందించిన కార్యక్రమ సమాచారం, డేటా ఆధారిత అంతర్దృష్టులు, కార్యాచరణ సూచనలు కార్యక్రమ పురోగతిని పర్యవేక్షించడంతోపాటు తదుపరి నిర్ణయాలకు ఉపయోగపడ్డాయి.

"తొలి ఏడాదిలోనే 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు చేరువ కావడం తెలంగాణలో నాణ్యమైన అభ్యసన అవకాశాలను విస్తరించడంలో ముఖ్యమైన ముందడుగు'' అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా, ఐఏఎస్ తెలిపారు. డిజిటల్ గణితం, సైన్స్ అభ్యసనను విద్యార్థుల రోజువారీ విద్యలో స్థిరమైన భాగంగా మార్చడమే తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా SCERT, ఖాన్ అకాడమీ ఇండియాతో కలిసి 200 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేసింది. వారు మండల వనరుల వ్యక్తులకు శిక్షణ ఇవ్వగా, వారు మండల స్థాయిలో గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ క్యాస్కేడ్ శిక్షణ విధానం ద్వారా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయికి విస్తరించారు.

KGBVల్లోనూ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. లక్ష మందికి పైగా విద్యార్థులు ఇందులో నమోదు కాగా, ఇది ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యలో దాదాపు 84 శాతంగా ఉంది. ముఖ్యంగా సైన్స్ అభ్యసనంపై విద్యార్థులు ఆసక్తి చూపడం గమనార్హం.

ఖాన్ అకాడమీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి వాసుదేవన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ నాయకత్వం, SCERT సహకారం, జిల్లా అధికారులు, పాఠశాలల నాయకులు, ఉపాధ్యాయుల కృషి వల్ల ఈ విజయాన్ని సాధించామని తెలిపారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో కార్యక్రమాన్ని మరింత విస్తరించడంతోపాటు విద్యార్థుల అభ్యసన నాణ్యత, క్రమబద్ధమైన వినియోగంపై దృష్టి సారించనున్నారు. జిల్లా నోడల్ అధికారులు వారపు పర్యవేక్షణ ద్వారా పాఠశాలలకు అవసరమైన సహకారం అందించనున్నారు.

పాలెం గ్రామంలో ఉద్రిక్తత

సహకార సంఘం గోడౌన్ ముట్టడించిన రైతులు

సహకార పంపిణీలో జాప్యం.. పాలెం గిడ్డంగికి తాళం వేసి రైతుల నిరసన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 31:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం పాలెం గ్రామంలో యూరియా పంపిణీ విషయంలో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గిడ్డంగిలో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ యూరియా యాప్‌లో బుకింగ్ కావడం లేదని రైతులు ఆరోపించారు. సహకార సంఘం గిడ్డంగిలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నప్పటికీ స్థానిక రైతులకు యాప్ ద్వారా బుకింగ్ అవకాశం కల్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

యాప్‌లో సాంకేతిక సమస్యలు పొరపాట్లు జరుగుతున్నాయని చెబుతూ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది తమకు అనుకూలంగా ఉన్న కొందరికి మాత్రమే యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు.

వారు బుకింగ్ చేసుకున్న అనంతరం యాప్‌ను ఆఫ్ చేస్తున్నారని, దీంతో ఇతర రైతులకు యూరియా బుక్ చేసుకునే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. అంతేకాకుండా, యూరియాను కొందరు సిబ్బంది బ్లాక్ మార్కెట్‌లో ఒక్కో బస్తాను రూ.800 నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అందాల్సిన యూరియా అధిక ధరలకు విక్రయించడంపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా అవసరమైన సమయంలో బుకింగ్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గిడ్డంగిలో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ మరోవైపు రైతులకు అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరించి రైతులందరికీ సమానంగా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఈ క్రమంలో స్థానిక రైతులు పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గిడ్డంగిని ముట్టడించి గిడ్డంగికి తాళం వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. యూరియా పంపిణీలో పారదర్శకత పాటించాలని,రైతులందరికీ యాప్ ద్వారా సమాన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే యూరియా పంపిణీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రస్తుత సిబ్బందిని తక్షణమే బదిలీ చేయాలని సంబంధిత అధికారులను రైతులు కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఎక్కువ దిగుబడి.. మెరుగైన ఆదాయమే లక్ష్యం

పసుపు సాగులో అధునాతన పద్ధతులపై రైతులకు శిక్షణ

సెప్టెంబర్ 1న ఏర్గట్లలో కార్యక్రమం

హాజరుకానున్న పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)ఆగస్టు 31:

పసుపు పంటను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించడంతోపాటు మెరుగైన ఆదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పించేందుకు పసుపు పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలో సెప్టెంబర్ 1న ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

పసుపు సాగులో నూతన ఉత్పత్తి సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తన ఎంపిక, నేల తయారీ, నాటే విధానం, ఎరువుల వినియోగం, తెగుళ్లు, చీడపీడల నివారణ, నీటి యాజమాన్యం తదితర అంశాలపై ఈ శిక్షణలో వ్యవసాయ నిపుణులు రైతులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు.

పంటను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడంతోపాటు దిగుబడి, నాణ్యత పెంచుకునే విధానాలను క్షేత్రస్థాయిలో వివరించనున్నారు.

పసుపు సాగులో రైతులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక సాగు పద్ధతుల ద్వారా చేకూరే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పసుపు పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. విద్యా, ఇతర పరిశోధన అధికారులు హాజరై రైతులకు దిశానిర్దేశం చేయనున్నారు. మండలంలోని పసుపు పండించే రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పసుపు సాగులో మెరుగైన ఫలితాలు సాధించాలని నిర్వాహకులు కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య హెచ్చరిక!

విగ్రహాల ఏర్పాటు, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి: సీపీ సాయి చైతన్య

డీజేలపై ఉక్కుపాదం.. రాత్రి 10 దాటితే సీజ్: పోలీస్ కమిషనర్ ఆదేశాలు

అనుమతి లేని ఊరేగింపులపై కఠిన చర్యలు: స్పష్టం చేసిన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్ ,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 31:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు శాంతిభద్రతలకు, ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా ప్రభుత్వం, పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐపీఎస్ సూచించారు. ఈ మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి:

ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు. జన రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు,హైలాండ్ ప్రాంతాలు,ప్రభుత్వ భవనాల వద్ద ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు.

డీజేలు,అధిక శబ్దంపై ఆంక్షలు:

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధిక శబ్దంతో డీజేలు,సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయరాదని తెలిపారు. అధిక శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు.

నివాస,వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి సమయంలో నిర్దేశిత పరిమితికి

మించి శబ్దం చేయరాదని, సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఊరేగింపులు, సభలకు ముందస్తు అనుమతులు:

ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన శబ్దాన్ని ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగం నిషేధమని తెలిపారు. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు. 500 మందిలోపు సమావేశాలు లేదా సభలకు సంబంధిత అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలని, 500 మందికి పైగా పాల్గొనే కార్యక్రమాలకు కనీసం 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ నుంచి అనుమతి పొందాలని సూచించారు.

సార్వజనిక ప్రదేశాల్లో భద్రతా నిబంధనలు:

మాల్స్,సినిమా థియేటర్లు, హోటళ్లు, ఎగ్జిబిషన్లు,వ్యాపార సంస్థలు తదితర సార్వజనిక ప్రదేశాల్లో ప్రజల భద్రతకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు.ప్రజలు క్యూలోనే సేవలు పొందేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు:

డ్రోన్ల వినియోగం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డ్రోన్ల వినియోగంతో జనజీవనానికి అంతరాయం కలగడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం డ్రోన్లను వినియోగించదలచిన వారు సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీస్,ఏవియేషన్ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు.నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై అప్రమత్తంగా ఉండాలి:

ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పాస్‌పోర్టు,వీసా, రవాణా,టూరిస్టు తదితర సేవలు అందిస్తామని చెప్పే నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.గల్ఫ్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు అద్దెకు వస్తే ముందస్తుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మైనర్లకు ఏ సర్టిఫికెట్ సినిమాలు అనుమతి లేదు:

నిజామాబాద్ జిల్లాలో ఏ సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు వీక్షించేందుకు థియేటర్ల నిర్వాహకులు అనుమతించరాదని తెలిపారు.సినిమా థియేటర్ల యాజమాన్యాలు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు:

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పూర్తిగా నిషేధమని కమిషనర్ స్పష్టం చేశారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తుల వల్ల రోడ్డు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు కలగడంతోపాటు ప్రజా ప్రశాంతతకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

మహిళలు,పిల్లల పట్ల అసభ్యకరంగా లేదా వికృతంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు:

పై నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్,బోధన్ డివిజన్ల పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలకు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని, ప్రజలందరూ పోలీసు అధికారులకు సహకరించాలని కమిషనర్ కోరారు.

విహారయాత్ర విషాదం..

- కుబీర్ మండలానికి చెందిన ముగ్గురు మృతి!
- మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం..
- జీబ్ బోల్తా పడి ముగ్గురు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

నిర్మల్ ఆగస్టు 31 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా కుబీర్ మండలం లోని పార్ది(బి గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ఇస్లాపూర్ తాలూకా సహస్రకుండ్ గ్రామంలో ఉన్న మహాదేవ్ మందిరాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం. శ్రావణ మాసంలో భాగంగా కుటుంబ సభ్యులు మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా ఇస్లాపూర్ తాలూకా పరిధిలోని సహస్రకుండ్ గ్రామంలోని మహాదేవ్ మందిరానికి దర్శనం కోసం వెళ్లినట్లు తెలుస్తోంది. దర్శనం అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా హుడీఘాట్ సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం జీబు అదుపుతప్పి బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

మృతులు, క్షతగాత్రులు కుబీర్ మండలం పార్ది–బి గ్రామానికి చెందిన వారిగా ప్రాథమికంగా సమాచారం అందుతోంది. అయితే మృతుల పూర్తి వివరాలు, గాయపడిన వారి వివరాలు, ప్రమాదానికి గల కారణాలపై అధికారిక సమాచారం ఇంకా వెలువడాల్సి ఉంది.

ఫ్యూచర్ సిటీలో కలిపే వరకు

పోరాటం ఉధృతం చేస్తాం

- ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డు పడుతున్న వారిని ప్రజలే అడ్డుకుంటారు
- ఫ్యూచర్ సిటీలో కలపడంపై పెరుగుతున్న మద్దతు
- మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో పూర్తిగా విలీనం చేయాలి
- 2 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి - గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్

మహేశ్వరం, ఆగస్టు 31:ప్రజా కలం:

భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని పూర్తిగా విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు దీక్షకు కూర్చున్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ గత ఏడాది కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తూ రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు.

ఈ దీక్షలకు కుల, మత, పార్టీలకు అతీతంగా వివిధ వర్గాల నుంచి మద్దతు లభించింది. ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కడారి జంగయ్య యాదవ్, పోతల దర్శన్ యాదవ్, సీపీఐ రాష్ట్ర నాయకులు దత్తు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాండు నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, మన్సాన్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ వి. నరసింహ యాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, బీజేపీ నాయకులు అల్లంపల్లి మల్లేష్, రమేష్, పి. సాంబయ్య యాదవ్, ఐ. నరసింహ గౌడ్, సర్దార్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు స్వామి గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

డిమాండ్ నెరవేరే వరకు పోరాటం

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వి. రఘుపతి మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీకి మహేశ్వరం మండలం అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ దాన్ని విలీనం చేయకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులు, యువత భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో మహేశ్వరాన్ని విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలు సమావేశాలు నిర్వహించి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలనే తీర్మానాలు చేసి, వాటిని జేఏసీ కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ అధికారులకు అందజేయాలని కోరారు. తీర్మానాలు ఇవ్వని పక్షంలో స్వచ్ఛందంగా మహేశ్వరం బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన చిలకమర్రి నర్సింహ

అనంతరం సోమవారం సాయంత్రం మాజీ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ చిలకమర్రి నర్సింహ దీక్షా శిబిరానికి చేరుకుని జేఏసీ కమిటీ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీ నాయకుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఇంద్రకంటి నరసింహ గౌడ్, ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టి మల్లేష్, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టి గణేష్, తడకల శీను, జి. శీను తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

కష్టాల్లో ఉన్న విలేకరుల కుటుంబాలకు మైనంపల్లి అండ

బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే

మానవతా దృక్పథంతో ప్రతి కుటుంబానికీ భరోసా

మల్కాజిగిరి ఆగస్టు31)ప్రజా కలం ప్రతినిధి) : కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచి, వారి బాధను పంచుకోవడమే నిజమైన మానవత్వమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆపదలో ఉన్న వారికి రాజకీయాలకు అతీతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో సోమవారం ఆకునూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆకునూరు గ్రామ మాజీ ఎంపీటీసీ కరెడ్ల రాంరెడ్డి సతీమణి ప్రమీల ఇటీవల మృతి చెందడంతో ఆమె నివాసానికి వెళ్లిన మైనంపల్లి హనుమంతరావు, కుమారుడు కరెడ్ల రాజేశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. కుటుంబంలో ఒకరిని కోల్పోవడం భరించలేని విషాదమని అన్నారు. ప్రమీల మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. అందరితో ఆప్యాయంగా మెలిగే ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,వారికి తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.

అనంతరం నేరేడ్‌మెట్‌కు చెందిన ఈనాడు విలేకరి మహేష్ తండ్రి గణేష్ ప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మైనంపల్లి, ఆకునూరులోని మహేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేష్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి,మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. బాధలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం,వారికి మనోధైర్యం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ప్రజల కష్టసుఖాల్లో తన వంతు బాధ్యతగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మాజీ సర్పంచ్ వెలగల రఘువీర్,మత్స్యశాఖ మాజీ చైర్మన్ బోయిని రాజు,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీలు సుంకరి శ్రీధర్,పల్లె కనకయ్య,నాయకులు కోయినేని నరసయ్య, మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్‌బాగ్ మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్,ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.ఎన్.వి. సతీష్‌కుమార్, సత్యనారాయణ,బాబా, చుంకు శ్రీనివాస్, రాందాస్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం..

ఆచారాలను మరిచిన అధికారులు

- రావిరాలలో భక్తుల ఆవేదన

మహేశ్వరం ఆగస్టు 31 (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పుడు బోనాల పండుగ వచ్చిందంటే చాలు ప్రతి గుడికి రంగులు వేసి, ఆలయాలను ముస్తాబు చేసేవారని గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. గ్రామం జీహెచ్ఎంసీలో విలీనం అయ్యాక అధికారులు ఆలయాలను పూర్తిగా పట్టించుకోవడం మానేశారని వాపోతున్నారు. బోనాల పండుగ సమీపిస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు ఆలయాలకు రంగులు వేయకపోవడంతో, భక్తులే సొంత ఖర్చులతో గుడులకు రంగులు వేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. పండుగల సంప్రదాయాన్ని, ఆచారాలను కాపాడాలని, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com